




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 352, పేజీలు - 08

శుక్రవారం, జూన్ 12, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# హైదరాబాద్‌కు రూ. లక్ష కోట్లు ఇవ్వండి

**- 6 నగరాలతో ఎం-6 టాస్క్‌ఫోర్స్**

**- నీతి ఆయోగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి**

**- కేంద్రానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి**






**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాదని నీతి ఆయోగ్ సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను నీతి ఆయోగ్ లో ఆయన వివరించారు. విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచ స్థాయి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరమని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించాలన్నా, దేశంలోని ప్రతి విద్యార్థికి, పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని చెప్పారు. గురువారం రాష్ట్రపతి భవన్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధేనని గుర్తు చేశారు. ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని సీఎం చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని సీఎం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3.55 కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించిన ఈ సర్వేలో పైసలు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన అంశంగా తేలిందన్నారు. అందుకే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారా మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని స్పష్టం చేశారు.

### తెలంగాణలో విద్యా- నైపుణ్యాభివృద్ధి విప్లవం

విద్యాశాఖను తన వద్దే ఉంచుకోవడానికి కారణం విద్యపై తనకు ఉన్న నమ్మకమేనని సీఎం రేవంత్ రెడ్డి

2లో..

## టీఎంసీ విలీన ప్రచారాన్ని ఖండించిన కాంగ్రెస్

**- అవన్నీ వదంతులేనన్న కేసీ వేణుగోపాల్**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కాంగ్రెస్‌లో విలీనం కానుందన్న ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. అలాంటి చర్చలు ఎక్కడా జరగలేదని స్పష్టం చేసింది. ఈ వార్తలన్నీ పూర్తిగా నిరాధారమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కొట్టిపారేశారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశానికి పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీ తర్వాతే రెండు పార్టీల విలీనంపై ఊహాగానాలు

2లో..

## టీఆర్ఎస్ టైటిల్ వార్

**- టీఆర్ఎస్ పేరుపై వందల అభ్యంతరాలు - అదే పేరుతో మరో రెండు పార్టీలు కూడా**

**- కవితకు షాక్ తప్పదా?**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ సెంటిమెంట్‌ను తిరిగి రగిల్చి, రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేయాలని తెలంగాణ రక్షణ సేన పేరుతో సరికొత్త ప్రయాణాన్ని ప్రారంభించిన కల్వకుంట్ల కవితకు ప్రారంభంలోనే ఊహించని చట్టపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి బహిష్కరణకు గురైన తర్వాత సొంతంగా రాజకీయ అస్తిత్వం కోసం కవిత ఈ కొత్త పార్టీని ప్రకటించారు. అయితే, భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రజాభిప్రాయం, అభ్యంతరాల కోసం పత్రికా ప్రకటన జారీ చేసిన తరుణంలో ఆమె ఎంచుకున్న టీఆర్ఎస్ అనే సంక్షిప్త నామంపై ఈసీకి ఏకంగా 600

2లో..

## రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని అన్ని ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తొలి

2లో..

## నీతి ఆయోగ్ భేటీలో ‘స్వర్ణాంధ్ర @2047’ విజన్

**- సీఎం చంద్రబాబు కీలక ప్రజంటేషన్**




**- గత రెండేళ్లలో రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించామని స్పష్టం**

**- ప్రోత్సాహకాల పోటీ కాకుండా సుస్థిర అభివృద్ధిపై రాష్ట్రాలు దృష్టి పెట్టాలని పిలుపు**

**- రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు తగ్గుదలపై జాతీయ స్థాయిలో దృష్టి సారించాలని విజ్ఞప్తి**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఢిల్లీ వేదికగా జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సంబంధించిన కీలక ప్రణాళికను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ ‘వికసిత భారత్ @2047’ లక్ష్యానికి అనుగుణంగా ‘స్వర్ణాంధ్ర @2047’ విజన్‌ను ఆయన సభ్యుల ముందుంచారు. ఈ విజన్ ద్వారా రాష్ట్రాన్ని సంపన్న, సమ్మిళిత, ప్రపంచ పోటీతత్వ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు. మానవ వనరుల ఆధారిత అభివృద్ధి నమూనాను అమలు చేస్తామని చంద్రబాబు వివరించారు. దీని ద్వారా సంపూర్ణ పేదరిక నిర్మూలన, భారీ ఎత్తున ఉపాధి అవకాశాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, జల, ఇంధన భద్రత కల్పించడం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని తెలిపారు. వ్యవసాయ-టెక్, లాజిస్టిక్స్, డీప్-టెక్ వంటి రంగాలను అనుసంధానిస్తూ అభివృద్ధిని వేగవంతం చేస్తామని అన్నారు. పాలనలో పారదర్శకత, సామర్థ్యం పెంచేందుకు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత విశ్లేషణలు, రియల్ టైమ్ మానిటరింగ్ వ్యవస్థలు, ‘అవేర్’ వంటి ముందస్తు అంచనా సాధనాలను వినియోగిస్తున్నామని, ఇవి మెరుగైన పౌర సేవలకు

2లో..

## హైదరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్

**- రూ.5000 కోట్ల స్కామ్‌కు చెక్**

**- 'ఇగ్నైట్' పేరుతో కొత్త స్కామ్‌కు తెరలేపిన క్యూనెట్ నిర్వాహకులు**

**- ఆపరేషన్ ఇగ్నైట్ క్రాక్‌డౌన్‌తో ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**- సంస్థ ఏర్పడిన 18 రోజుల్లోనే చర్యలు తీసుకున్న హైదరాబాద్ సీసీఎస్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ పోలీసులు సుమారు రూ. 5,000 కోట్ల భారీ ఆర్థిక మోసాన్ని సకాలంలో గుర్తించి అడ్డుకున్నారు. ‘ఇగ్నైట్’ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న మనీ సర్క్యులేషన్ నెట్‌వర్క్‌ను ఛేదించి, నలుగురు కీలక నిందితులను అరెస్టు చేశారు. అమాయక ప్రజల నుంచి భారీగా నగదు వసూలు చేసేందుకు సిద్ధమైన

2లో..

## ప్రధాని మోదీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**- తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చ**

**- మెట్రో ఫేజ్-2, ఆర్ఆర్ఆర్, 12 లేన్ల ఎక్స్‌ప్రెస్‌వే ప్రాధాన్యం**

**- ప్రధాని మోదీతో భేటీలో రేవంత్ రెడ్డి చర్చ**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇదే పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు కేంద్రమంత్రులను కలిశారు. నీతి ఆయోగ్ సమావేశం ముగిసిన తర్వాత గురువారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్

## జాతీయ స్థాయికి సేనగళం

**- పవన్ కళ్యాణ్ నెక్స్ట్ లెవల్ ప్లాన్**



**న్యూఢిల్లీ / అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన జనసేన పార్టీ, ఇప్పుడు జాతీయ రాజకీయాల వైపు అడుగులు వేస్తోంది. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా ఈ నెల 14 నుండి 16 వరకు మూడు రోజుల పాటు జనసేన పార్టీ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనుంది. పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా ఈ సమావేశాలకు హాజరై దిశానిర్దేశం చేయనున్నారు. ప్రాంతీయ పార్టీగా ఉన్న జనసేన సిద్ధాంతాలను, భావజాలాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ పర్యటనను ఒక వేదికగా మలుచుకోనున్నారు.

### సేన గళం పై జాతీయ స్థాయిలో ప్రచారం

ఈ పర్యటనలో అత్యంత కీలకమైన అంశం సేన గళం. సమాజంలో బాధ్యతాయుతమైన రాజకీయ సంస్కృతిని పెంపొందించడం, కుల రాజకీయాలకు అతీతంగా అభ్యుదయ భావాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పవన్ కల్యాణ్ ఇటీవలే ఈ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా నేటి తరం యువత జెన్ జీ ఆకాంక్షలకు అనుగుణంగా, రాజ్యాంగ విలువల పరిరక్షణే ధ్యేయంగా ఈ సేన గళం పనిచేయనుంది. ఈ వేదిక ముఖ్య ఉద్దేశాలు, ఆశయాలను జాతీయ మీడియా ద్వారా దేశ ప్రజలకు పవన్ కల్యాణ్ వివరించనున్నారు.

### ఢిల్లీకి 150 మంది జనసేన కీలక నేతలు

ఢిల్లీ పర్యటన కోసం జనసేన పార్టీకి చెందిన సుమారు 150 మంది ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధ్యక్షులు తరలివెళ్లనున్నారు. దేశ రాజధానిలో జనసేన క్యాడర్ ఇంత పెద్ద ఎత్తున ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం ఇదే మొదటిసారి. మూడు రోజుల పాటు

2లో..

## గృహిణులు ‘జాతి నిర్మాతలు’

**- గృహిణి నెల ఆదాయం రూ. 30,000.. సుప్రీం చారిత్రక తీర్పు**

**- నష్టపరిహారంలో ఇది ప్రత్యేక, అదనపు విభాగంగా చేర్పు**

**- ప్రతి మూడేళ్లకు ఈ మొత్తంలో 10 శాతం పెంపుదల**

**- 25 ఏళ్ల నాటి కేసులో వెలువడిన చరిత్రాత్మక తీర్పు**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) గృహిణుల వెలకట్టలేని సేవలకు చట్టపరమైన, ఆర్థికపరమైన గుర్తింపునిస్తూ సుప్రీంకోర్టు ఒక చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ఇంట్లో ఉండి కుటుంబాన్ని చూసుకునే గృహిణులను ‘జాతి నిర్మాతలు’గా అభివర్ణించిన సర్వోన్నత న్యాయస్థానం, మోటారు వాహన ప్రమాదాల్లో వారు మరణిస్తే నష్టపరిహారం లెక్కించేందుకు వారి నెలసరి ఆదాయాన్ని కనీసం రూ.30,000గా

2లో..

## అత్యధిక వేడి ముప్పున్న నగరాల్లో హైదరాబాద్!

2లో..

**- ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి**



ప్రజాప్రశ్న



# హైదరాబాద్‌కు రూ. లక్ష కోట్లు ఇవ్వండి

నొక్కి చెప్పారు. గడచిన 75 ఏండ్లలో మనమంతా ఉచిత విద్య అందించేందుకు ప్రయత్నం చేశామని, కానీ నాణ్యమైన విద్యను అందించడం మనకు ఒక సవాలుగా మారిందన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు.నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్ లో చదివే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వం నిర్మించే యంగ్ ఇండియా స్కూల్స్ కులాల మధ్య గోడలు కూల్చివేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకోవడం, కలిసి జీవించడం ద్వారా కుల వివక్ష తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నామని వెల్లడించారు.దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా.. అధికారులైనా తమ రాష్ట్రంలోని యంగ్ ఇండియా స్కూల్స్ చూడాలంటే తాము సంతోషంగా చూపిస్తామని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తయారీ రంగం, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు ఈ యూనివర్సిటీ నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారని వివరించారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు టాటా గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని సీఎం తెలిపారు.ఈ ప్రాజెక్టులో టాటా సంస్థ రూ.2,100 కోట్ల పెట్టుబడి పెడుతుందన్నారు. 'తెలంగాణ రైజింగ్' విజన్ లో భాగంగా 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పారు. ఉన్నత విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ కేంద్రంగా మారుతోందన్నారు. ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, ఐఎస్‌బీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నాయని, హైదరాబాద్ కు ఐఐఎం కూడా రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ఈ దిశగా యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్ లో ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు చే యడం తొలి విజయమని వివరించారు. దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజిన్లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, కోల్ కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు.ఈ నగరాల అభివృద్ధి కోసం రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేటాయించాలని కోరారు. ఒక్కో నగరానికి రూ.1 లక్ష కోట్లు చొప్పున మౌలిక వసతుల అభివృద్ధికి అందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ సీఎం పలు ప్రతిపాదనలు చేశారు. రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు, హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు వంటి అంశాల్లో సహకారం అందించాలని కోరారు. దేశ ప్రజల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెడితే ప్రపంచంలోనే అత్యుత్తమ దేశంగా భారత్ అవతరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## టీఎంసీ విలీన ప్రచారాన్ని ఖండించిన కాంగ్రెస్

మొదలయ్యాయి.అయితే ఆ సమావేశంలో జాతీయ రాజకీయ అంశాలపై మాత్రమే చర్చ జరిగిందని వేణుగోపాల్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా సమస్యలను మరింత సమర్థంగా ఎలా లేవనెత్తాలనే అంశంపైనే చర్చ జరిగిందన్నారు. విలీన ప్రతిపాదన గానీ, అలాంటి చర్చలు గానీ అస్సలు జరగలేదని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల టీఎంసీ తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల్లో అసమ్మతి పెరిగిందన్న వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్‌తో టీఎంసీ విలీనం కావచ్చన్న ప్రచారం ఊపందుకుంది. ఇదే అంశంపై టీఎంసీ ఎంపీ సౌగత రాయ్ కూడా స్పందించారు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడం అవసరమని చెప్పారు. అయితే అది కూటమి రూపంలో ఉంటుందా, విలీనం రూపంలో ఉంటుందా అనేది ఇప్పుడే చెప్పలేమన్నారు. మరోవైపు విలీనంపై టీఎంసీ అధిష్ఠానం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

## నీతి ఆయోగ్ భేటీలో 'స్వర్ణాంధ్ర @2047' విజన్

దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన పాలనా సంస్కరణలు, పారదర్శక విధానాలు, వ్యాపార అనుకూల వాతావరణం కారణంగా గత రెండేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి సభకు తెలియజేశారు. దీనివల్ల రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి కల్పనతో పాటు ఆర్థిక వృద్ధికి మార్గం సుగమమైందని అన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రాల మధ్య పెట్టుబడుల ఆకర్షణ కోసం అనారోగ్యకరమైన పోటీ తగదని హితవు పలికారు. కేవలం ప్రోత్సాహకాలపై ఆధారపడకుండా మౌలిక సదుపాయాల బలోపేతం, విధాన స్థిరత్వం, అనుమతుల వేగవంతం వంటి సుస్థిర అభివృద్ధి మార్గాలపై దృష్టి సారించాలని రాష్ట్రాలకు సూచించారు. సమ్మిళిత అభివృద్ధి తమ ప్రభుత్వ అజెండా అని పునరుద్ఘాటించిన చంద్రబాబు, ప్రతి కుటుంబానికి ఇల్లు, పారిశుద్ధ్యం, కుళాయి నీరు, స్వచ్ఛమైన వంట ఇంధనం, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి ఏడు ప్రాథమిక అవసరాలను అందిస్తామని తెలిపారు.సమాజంలోని ఉన్నత వర్గాల్లోని 10 శాతం మంది, అట్టడుగున ఉన్న 20 శాతం మందికి అండగా నిలిచేందుకు ఉద్దేశించిన వినూత్న 'పీ4-ఎంబీకే 10-20' కార్యక్రమాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఆరోగ్య రంగంలో 'ప్రాజెక్ట్ సంజీవని' ద్వారా నివారణ వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని, ఏఐ ఆధారిత విద్యతో భవిష్యత్ అవసరాలకు యువతను తీర్చిదిద్దుతున్నామని వివరించారు.

రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5 కంటే తక్కువగా ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, జనాభా సుస్థిరతపై జాతీయ స్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. భవిష్యత్తులో శ్రామిక శక్తి కొరత, వృద్ధాప్య సంబంధిత సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్ర జనాభా నిర్వహణ విధానాన్ని రూపొందించినట్లు తెలిపారు. సహకార సమాఖ్య స్ఫూర్తికి ఆంధ్రప్రదేశ్ కట్టుబడి ఉందని, 'వికసిత భారత్ 2047' అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు.

## రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

దశలో భాగంగా 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఒకే నమూనాలో కొత్త భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అద్దె ఇళ్లలో, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాల సమస్యకు దీని ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు తుది డిజైన్లను ఖరారు చేస్తామని తెలిపారు.

భవన నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.మరోవైపు, ఓఆర్ఆర్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి ఆధునిక సమీకృత భవనాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్, పటాన్‌చెరు, కోహెడలలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేసిందని విమర్శించిన మంత్రి, తాము కొత్త మండలాలకు అవసరమైన పోస్టులను భర్తీ చేసి పరిపాలనను బలోపేతం చేశామని వివరించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## హైదరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్

ఈ ముఠా కుట్రను సీసీఎస్ పోలీసులు ముందే పసిగట్టారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియాకు వెల్లడించారు. ఈ వ్యవహారంలో హైదరాబాద్ పోలీసులు 'ఆపరేషన్ ఇగ్నైట్ క్రాక్‌డౌన్' పేరిట ప్రత్యేక చర్యలు చేపట్టారు. కేరళ, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

సదరు సంస్థ భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన కేవలం 18 రోజుల్లోనే పోలీసులు రంగంలోకి దిగి, పెను నష్టం జరగకుండా నివారించడం విశేషం.గతంలో నిషేధానికి గురైన క్యూనెట్, విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ నెట్‌వర్క్‌ల నిర్వాహకులే 'ఇగ్నైట్' పేరిట ఈ సరికొత్త మోసానికి తెరలేపినట్లు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) దర్యాప్తులో వెల్లడైంది. గత మూడు దశాబ్దాలుగా ఈ ముఠా వరుసగా గోల్డ్ క్వెస్ట్, క్వెస్ట్‌నెట్, క్యూనెట్, తాజాగా ఇగ్నైట్ రూపంలో వివిధ పేర్లతో ప్రజలను వంచిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు బాధితులు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. భారీస్థాయిలో ప్రజలు ఆర్థికంగా నష్టపోకముందే ఇలాంటి మనీ సర్క్యులేషన్ రాకెట్లను గుర్తించి, వాటిని నిర్మూలించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీపీ సజ్జనార్ వివరించారు.

# టీఆర్ఎస్ టైటిల్ వార్

నుండి 700 వరకు భారీ సంఖ్యలో అభ్యంతరాలు రావడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

### టీఆర్ఎస్ పేరు కోసం మరో పార్టీ దరఖాస్తు

ఈ వివాదాన్ని మరింత క్లిష్టంగా మారుస్తూ కవిత కంటే ముందే మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన తెలంగాణ రాష్ట్రసామాజిక సేన అనే మరో ప్రాంతీయ పార్టీ కూడా ఇదే టీఆర్ఎస్ అనే సంక్షిప్త నామంతో గుర్తింపు కోసం కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. కవిత నేతృత్వంలోని టీఆర్ఎస్ మే మొదటి వారంలో పత్రికా ప్రకటనలు ఇవ్వగా సోలాపూర్ ఆధారిత పార్టీ అంతకంటే ముందే ఏప్రిల్ చివరి వారంలోనే జాతీయ దినపత్రికలలో నోటిఫికేషన్ ఇచ్చింది. వీటికి తోడు, ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలో తెలంగాణ రక్షణ సమితి డెమోక్రటిక్ , 'తెలంగాణ రాజ్య సమితి అనే రెండు చిన్న పార్టీలు నమోదై ఉండటం కవిత వ్యూహాలకు పెద్ద బ్రేక్‌గా మారింది.

### బీఆర్ఎస్ కూడా తీవ్ర అభ్యంతరం

మరోవైపు, ఈ వ్యవహారంలో భారత్ రాష్ట్ర సమితి కూడా అధికారికంగా రంగంలోకి దిగి ఈసీకి లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది

. గతంలో కేసీఆర్ నాయకత్వంలో 14 ఏళ్ల పాటు ఉవ్వెత్తున సాగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి తెలంగాణ రాష్ట్ర సమితి పేరే బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచింది. ఈ పేరు ప్రజల మనస్సుల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ఓటర్లలో ఇప్పటికీ బలంగా నాటుకుపోయి ఉందని బీఆర్ఎస్ నేతలు గుర్తు చేస్తున్నారు. కేవలం మూడేళ్ల క్రితమే తాము జాతీయ రాజకీయాల కోసం టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చినప్పటికీ ఇప్పుడు హఠాత్తుగా అదే పేరును వేరే కొత్త శక్తులకు కేటాయిస్తే భవిష్యత్తు ఎన్నికల్లో ఓటర్లు తీవ్రంగా గందరగోళానికి గురయ్యే ప్రమాదం ఉందని, తద్వారా తమ పొలిటికల్ మైలేజ్ దెబ్బతింటుందని గులాబీ దళం గట్టిగా వాదిస్తోంది. ఈసీ నిబంధనల ప్రకారం కూడా రిజిస్టర్డ్ పార్టీల పేర్లను పోలిన గుర్తులను, పేర్లను కొత్త పార్టీలకు ఇవ్వకూడదనే నిబంధనను వారు గుర్తు చేస్తున్నారు.

### ఎన్నికల సంఘం ఏ నిర్ణయం తీసుకుంటుందో?

ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం తీసుకోబోయే నిర్ణయం కవిత రాజకీయ భవిష్యత్తును శాసించనుంది. సాధారణంగా ఒకే రకమైన ఉచ్చారణ , ఒకే విధమైన అక్షరాలు ఉండి, ఓటర్లను అయోమయానికి గురిచేసేలా ఉంటే ఈసీ ఆ పేర్లను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తుంది. ఒకవేళ ఈసీ గనుక ఈ 700కు పైగా వచ్చిన అభ్యంతరాలను, ముఖ్యంగా బీఆర్ఎస్ వాదనను పరిగణనలోకి తీసుకుని టీఆర్ఎస్ అనే అబ్రివియేషన్‌ను తిరస్కరిస్తే కవిత మళ్లీ మొదటికొచ్చి తన పార్టీ పేరును, లోగోను పూర్తిగా మార్చుకోవాల్సి వస్తుంది. ప్రస్తుతం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయం వేదికగా కవిత టీఆర్ఎస్ ఈజ్ బ్యాక్ అంటూ క్యాడర్‌లో జోష్ నింపేందుకు, రాష్ట్రవ్యాప్త జెండా పండుగలకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ అభ్యంతరాల పర్వం ఆమెకు పెద్ద రాజకీయ అగ్నిపరీక్షగా మారింది.

# అత్యధిక వేడి ముప్పున్న నగరాల్లో హైదరాబాద్!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రతల ముప్పును ఎదుర్కొంటున్న నగరాల జాబితాలో హైదరాబాద్ కూడా చేరింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తాజాగా వెల్లడించిన ఒక అధ్యయనం ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉష్ణ ప్రమాదాలు పొంచి ఉన్న 30 నగరాలలో హైదరాబాద్ ఒకటిగా నిలిచింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వేగవంతమైన పట్టణీకరణ వల్ల తలెత్తుతున్న పర్యావరణ ముప్పులకు ఈ నివేదిక అద్దం పడుతోంది. 'మూవింగ్ బియాండ్ ఎక్స్‌పోజర్' పేరిట ప్రపంచవ్యాప్తంగా 205 ప్రధాన నగరాలపై ఈ పరిశోధన నిర్వహించారు. కేవలం గరిష్ఠ ఉష్ణోగ్రతలు కాకుండా, నగరాల్లోని కూలింగ్ సదుపాయాలు, పచ్చదనం, సామాజిక-ఆర్థిక పరిస్థితులు వంటి వివిధ అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ నివేదికను రూపొందించారు. ఒక కోటికి పైగా జనాభా కలిగిన హైదరాబాద్ నగరానికి 'హీట్ వల్నరబిలిటీ ఇండెక్స్'లో 0.68 స్కోర్ లభించింది. ఈ జాబితాలో కైరో, మనీలా వంటి అంతర్జాతీయ నగరాల సరసన హైదరాబాద్ నిలిచింది.భారత్‌లోని అహ్మదాబాద్, నాగ్‌పూర్, మదురై నగరాల్లో హైదరాబాద్ కంటే ఎక్కువ ముప్పు ఉన్నట్టు ఈ నివేదిక స్పష్టం చేసింది. కాగా ముంబై, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ వంటి నగరాల పరిస్థితి కాస్త మెరుగ్గా ఉన్నట్లు వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఉష్ణ ముప్పును ఎదుర్కొంటున్న టాప్-50 నగరాల్లో 14 భారత్‌కు చెందినవే కావడం గమనార్హం. ఈ ఏడాది వేసవిలో హైదరాబాద్ నగరం గత దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతటి తీవ్రమైన ఎండలను చవిచూసింది. ఏప్రిల్ 1 నుంచి జూన్ 5 మధ్యకాలంలో సుమారు 47 రోజులు పాటు ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. నగరం వేగంగా విస్తరించడం, పచ్చదనం క్షీణించడం, తగ్గిన కూలింగ్ సదుపాయాలు అందరికీ అందుబాటులో లేకపోవడం వంటి కారణాలు ఈ ముప్పును మరింత తీవ్రం చేస్తున్నాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నగరాలు తక్షణమే స్పందించి పచ్చదనాన్ని పెంచాలని, అందరికీ అందుబాటులో ఉండేలా కూలింగ్ సదుపాయాలను మెరుగుపరచాలని ఈ అధ్యయనం సూచిస్తోంది.

## ప్రధాని మోదీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు రావాల్సిన ఆర్థిక, ఇతర సహకారాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. తెలంగాణ రాష్ట్రంలో రవాణా రంగంతోపాటు పారిశ్రామిక అభివృద్ధికి ఊతం ఇచ్చే రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) పనుల పురోగతిని ఈ సందర్భంగా ప్రధాని మోదీకి సీఎం రేవంత్ వివరించినట్లు తెలుస్తోంది. ఈ ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు కావాల్సిన కేంద్ర ప్రభుత్వ నిధులను వెంటనే రిలీజ్ చేయాలని కోరారు. దీంతో పాటు తెలంగాణ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం డీప్ వాటర్ పోర్టు వరకు నిర్మించేందుకు ప్రతిపాదించిన అత్యంత కీలకమైన 12 లేన్ల ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నగరవాసుల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు సిద్ధం చేసిన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 పనులకు కేంద్ర ప్రభుత్వ వాటాను అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఈ సందర్భంగా ప్రధానిని రేవంత్ రెడ్డి కోరారు. అదే సమయంలో హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చేలా పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా తమ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన మూసీ నది ప్రక్షాళన కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ ఆర్థిక, టెక్నికల్ సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో దక్షిణ తెలంగాణకు వరప్రదాయిని అయిన జైపాల్ రెడ్డి పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి (పీఆర్ఎస్ఐఎస్) సంబంధించి కేంద్ర జల సంఘం నుంచి త్వరగా ఆమోదం ఇప్పించాలని ఈ భేటీలో ప్రధాని మోదీని రేవంత్ రెడ్డి కోరినట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీతో భేటీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో కూడా సమావేశం అయ్యారు. పట్టణ అభివృద్ధి శాఖకు సంబంధించిన విషయాలపై కేంద్రమంత్రితో చర్చించారు.

# జాతీయ స్థాయికి సేనగళం

జరిగే ఈ విస్తృత స్థాయి సమావేశాల్లో పార్టీ బలోపేతం, భవిష్యత్తు కార్యాచరణ మరియు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకలలో పార్టీ విస్తరణపై పవన్ కల్యాణ్ లోతుగా చర్చించనున్నారు. పాతకాలపు బూజుపట్టిన కుల రాజకీయాలను, వ్యక్తిగత దూషణల సంస్కృతిని పక్కనపెట్టి.. వాస్తవాలు, ప్రజాహితం ఆధారంగానే రాజకీయాలు సాగాలన్నదే పవన్ కల్యాణ్ ఆలోచన. ముల్లును ముల్లుతోనే తీయాలి.

ఒక కులం వారు విమర్శిస్తే అదే కులం వారితో తిట్టించాలి" అనే పాత ధోరణికి స్వస్తి పలకాలని 'సేన గళం' ద్వారా ఆయన పిలుపునిచ్చారు. ఈ వినూత్న పొలిటికల్ ఫిలాసఫీని జాతీయ స్థాయిలో ప్రజలకు పరిచయం చేయడం ఈ ఢిల్లీ టూర్ ప్రధాన ఎజెండా.

### జాతీయ స్థాయిలో ప్రత్యేక ముద్ర

ఢిల్లీ పర్యటన ముగింపు రోజున పవన్ కల్యాణ్ జాతీయ స్థాయి నేతలతో భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేనకు ఇటీవల ఏపీలో ఒక రాజ్యసభ స్థానం కూడా దక్కడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. జాతీయ స్థాయిలో జనసేన గళాన్ని బలంగా వినిపించడానికి, దేశ రాజధానిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడానికి ఈ 3 రోజుల ఢిల్లీ సమావేశం ఒక మైలురాయిగా నిలుస్తుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.


# విజయోత్సవ సభ సక్సెస్ కు జన సైనికులు పెద్ద ఎత్తున తరలి రావాలి

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి (ప్రశ్న న్యూస్) ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో హామీల్ని నెరవేర్చిన ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కి సమ ప్రాధాన్యత సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు ఇస్తున్నారని ఆయన చెప్పారు. తన కార్యాలయంలో గురువారం ఉదయం జనసేన ముఖ్యనాయకులతో తన కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. శుక్రవారం దామినేడు వద్ద జరిగే ఎన్డీఏ కూటమి రెండేళ్ల విజయోత్సవ సభ సక్సెస్ పై చర్చించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా జనసేన నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సభలో పాల్గొని విజయవంతంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. పది లక్షల కోట్ల రూపాయల అప్పు రాష్ట్రంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారం మోపి వెళ్లిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గుర్తు చేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ లు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తూ సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. రెండేళ్ల లో రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం పరుగులెత్తించడంతో పాటు పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి చైర్మన్ కొట్టే సాయి, పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జీ తమ్మినేని వెంకటేశ్వర రావు, నగర అధ్యక్షులు రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ బూత్ ల ఏర్పాటుకు సేవా భావంతో ముందుకు వచ్చిన ఈ-సిటీ యాజమాన్యం




విజయవాడ (ప్రశ్న న్యూస్) ఎండలు, వర్షాలు పట్టించుకోకుండా విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బందికి సరైన సౌకర్యాలు కల్పించాలనే ఆలోచనలతో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు సూచనల మేరకు ట్రాఫిక్ డి.సి.పి. షిరిన్ బేగం పర్యవేక్షణలో ట్రాఫిక్ విభాగంలో పలు విప్లవాత్మక మార్పులను తీసుకురావడం జరిగింది. ఈ క్రమంలో వాహన దారులకోసం గ్రీన్ పందిర్ల ఏర్పాటు చెయడం, సిబ్బందికి సమ్మర్ కిట్ లను అందించడం జరిగింది.ఈ నేపధ్యంలో మూడవ ట్రాఫిక్ ఎ.సి.పి. వేద ఆధ్వర్యంలో మూడవ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సుధాకర్ ఈ సిటీ యాజమాన్యం సహకారంతో ఎర్రకట్ట వద్ద ఉన్న పాడైపోయిన ట్రాఫిక్ బూత్ ను కొన్ని రోజులుగా పాడైపోయి ఉపయోగానికి పనికిరాని స్థితిలో ఉన్న ఈ ట్రాఫిక్ బూత్‌ను పూర్తిగా తీసివేసి , ఆకర్షణీయమైన స్టిక్కరింగ్‌తో కొత్తది అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. దీని వల్ల ట్రాఫిక్ సిబ్బంది ఎండలు, వర్షాలలో విధులు నిర్వహించే సమయంలో ఎదుర్కొనే ఇబ్బందులు గణనీయంగా తగ్గనున్నాయి. ప్రజా-ప్రైవేటు భాగస్వామ్యంతో పిపిపి నగర అభివృద్ధి సాధ్యమని ఈ చర్య మరొకసారి రుజువు చేసింది.ఈ సందర్భంగా విజయవాడ ట్రాఫిక్ పోలీస్ శాఖ తరపున ఈ సిటీ యాజమాన్యాము నా రఘునాథ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సై జివిఎన్ కుమార్, సరళ శ్రీ ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీహార్ బస్సు ప్రమాద బాధితులు సురక్షితంగా స్వస్థలాలకు చేరిక

మంత్రి ఆనం ఆదేశాలతో వేగవంతమైన చర్యలు. స్వస్థలాలకు చేరుకున్న ప్రమాద బాధితులు



నెల్లూరు(ప్రశ్న న్యూస్) బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందిన నెల్లూరు జిల్లా బాధితులు సురక్షితంగా స్వస్థలాలకు చేరుకున్నారు.రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో బాధితులను వారి స్వగ్రామాలకు చేర్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఈ రోజు ఉదయం నెల్లూరు హైవేలోని మెడికవర్ ఆసుపత్రి వద్దకు చేరుకున్న బీహార్ బస్సు నుండి బాధితులను స్థానిక అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులో సంగం, ఆత్మకూరు, రాంపల్లి, దుత్తలూరు తదితర ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా కష్టకాలంలో అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలకు బాధితులు, వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గృహిణులు 'జాతి నిర్మాతలు'

పరిగణించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటేశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది.ఈ తీర్పుతో, గృహిణి అందించే గృహ సంబంధిత సేవలకు వాటిల్లే నష్టాన్ని ఒక ప్రత్యేకమైన, అదనపు పరిహార విభాగంగా చేర్చారు. మోటారు ప్రమాదాల పరిహార మార్గదర్శకాలకు సంబంధించి గతంలో వచ్చిన 'ప్రణయ్ సేథి' కేసు తీర్పునకు ఇది అదనమని ధర్మాసనం వివరించింది. సంప్రదాయబద్ధమైన జీతం లేని గృహిణుల విషయంలో పరిహారం లెక్కించడానికి ఈ రూ.30,000 మొత్తాన్ని కనీస ప్రామాణిక నెలసరి ఆదాయంగా పరిగణించాలని పేర్కొంది. ఒకవేళ మరణించిన గృహిణికి వేరే ఆదాయ మార్గాలు ఉన్నా, ఈ మొత్తాన్ని అదనంగా కలపవచ్చని తెలిపింది. అంతేకాకుండా, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి మూడేళ్లకు ఒకసారి ఈ కనీస ఆదాయాన్ని 10 శాతం పెంచాలని కూడా ఆదేశించింది.ఇంటి పనులు చేయడం, పిల్లలను పెంచడం, కుటుంబాన్ని చూసుకోవడం వంటివి సమాజానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటివని కోర్టు తన తీర్పులో నొక్కి చెప్పింది. వేతనం లేనంత మాత్రాన ఈ పనులకు ఆర్థిక విలువ లేదని భావించడం చారిత్రక తప్పిదమని, దానిని సరిదిద్దేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వ్యాఖ్యానించింది. సమాజం సజావుగా సాగడంలో గృహిణుల పాత్ర అమూల్యమైనదని కొనియాడింది.ఈ కీలక తీర్పు వెనుక రెండు దశాబ్దాలకు పైగా సాగిన ఒక న్యాయపోరాటం ఉంది. 2001లో పంజాబ్‌లో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో రేష్మ అనే మహిళ మరణించారు. అప్పటి నుంచి ఆమె భర్త, పిల్లలు సరైన నష్టపరిహారం కోసం పోరాడుతున్నారు. ఈ అప్పీల్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పై సూత్రాన్ని వర్తింపజేసి, వారి కుటుంబానికి అందే పరిహారాన్ని గణనీయంగా పెంచింది. ఈ తీర్పు దేశవ్యాప్తంగా ఇలాంటి వేలాది కేసులపై ప్రభావం చూపనుంది.కేవలం మహిళలకే కాకుండా, ఇంటి బాధ్యతలు చూసుకునే పురుషులకు (హోమ్‌మేకర్స్) కూడా ఈ సూత్రం వర్తించే అవకాశం ఉంది. మోటారు ప్రమాద క్లెయిమ్‌లను ఏడాదిలోపు పరిష్కరించాలని, ఈ దిశగా హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు పరిపాలనాపరమైన చర్యలు తీసుకోవాలని కూడా సుప్రీంకోర్టు సూచించింది.

## ఘనంగా ప్రపంచ అవయవ ట్రాన్స్ ప్లాంట్ డే వేడుక




ప్రపంచ అవయవ ట్రాన్స్ ప్లాంట్ డే వేడుకలను బంజర హిల్స్ లోని సౌత్ ఏషియా లివర్ ఇన్స్టిట్యూట్ లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాడు అవయవ ట్రాన్స్ ప్లాంట్ విధానానికి ఆధ్యుడిగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేసిన మాజీ ఐఏఎస్ పివిఎన్ శర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లివర్ దాతలతో పాటు గ్రహీతలను డాక్టర్ టామ్ చెరియన్ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో రెండు లక్షల మందికి పైగా అవయవాలు ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించుకొని సంతోషంగా బతుకుతున్నారని అన్నారు. ఒకప్పటితో పోలిస్తే నేడు అవయవ ట్రాన్స్ ప్లాంట్ చికిత్స విధానాలలో ఎన్నో మార్పులు వచ్చాయని తెలిపారు. ఇండియాలో ఫ్యాటీ లివర్ సమస్య తీవ్రంగా పెరుగుతున్నదని ఇది ఆందోళనకరంగా ఉన్నదని దీనిని లివర్ సిరోసిస్ గా మారకముందే జాగ్రత్త పడాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను చిన్న వయసులోనే లివర్ ట్రాన్స్ ప్లాంట్ చేయించుకున్న వారికి కాలేయం అందించిన కుటుంబ సభ్యులను ఆయన సన్మానించారు.

## చుట్టం అని నమ్మితే భూమి కబ్జా పెట్టాడు

**- మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లపై ఆరోపణలు చేసిన మహిళ**

తమకు తాత ద్వారా సంక్రమించిన ఆస్తిని నమ్మించి తనతో సంతకం చేయించుకొని కబ్జా చేశారని యాదాద్రి మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు పై పలుగుల శ్రీవాణి అనే మహిళ ఆరోపణలు చేశారు. సోమాజిగూడ,ప్రెస్ క్లబ్లో వాసాలమర్రికి చెందిన పలుగుల శ్రీవాణి అనే మహిళ విలేకరుల సమావేశం నిర్వహించారు. తమ నాయనమ్మ తమ్ముడి కొడుకు వరుసకు తనకు మామ అయిన యాదాద్రి మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు తనకు ఎనిమిది ప్లాట్లు 80 లక్షల నగదును ఇస్తానని బాండ్లపై సంతకాలు చేయించుకొని మోసం చేశాడని అన్నారు. ఆయనపై న్యాయపోరాటం చేస్తున్న తాను ఇప్పటికే అతని ఇంటి ముందు ఆత్మహత్య ప్రయత్నం చేసి బ్రతికి వచ్చానని అన్నారు. ఇప్పుడు గుర్తుతెలియని వ్యక్తులు పోతంశెట్టి వెంకటేశ్వర్ల అనుచరులు తమ చుట్టూ తిరుగుతూ భూమిని వదులుకోవాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు.పోతంశెట్టి వెంకటేశ్వర్ల నుండి తమ భూమి తమకు ఇప్పించి తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులకు , రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహిళ విజ్ఞప్తి చేశారు.

## మల్కాజిగిరిలో మహిళ హత్య కేసు ఛేదన

**- గంటల్లోనే ప్రధాన నిందితుడి అరెస్ట్ - పిస్టల్, తూటాలు, కత్తులు స్వాధీనం**

**మల్కాజిగిరి,** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. కేసులో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన దేశీయ తయారీ పిస్టల్, సజీవ తూటాలు, కత్తులు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.మల్కాజిగిరి పోలీస్ స్టేషన్లో నమోదైన క్రైమ్ నెం. 479/2026 కేసు వివరాలను పోలీసులు వెల్లడించారు. మృతురాలు ధమరా నిశారాణి (35) కాగా, ప్రధాన నిందితుడు ఆమె భర్త ధమరా అరుణ్ కుమార్ (48). అతడు రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మరో నిందితుడు హర్దిందర్ సింగ్ అలియాస్ హర్భజన్ సింగ్ పరారీలో ఉండగా, మిర్ ముజమ్మిల్ అలీ ఖాన్ (23) పాత్రపై కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.దాంపత్య విభేదాలే హత్యకు కారణంపోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, అరుణ్ కుమార్ మొదట నిశారాణి అక్కను వివాహం చేసుకున్నాడు. అనంతరం నిశారాణిని వివాహం చేసుకున్నాడు. గత కొంతకాలంగా భార్య నిశారాణి ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న అరుణ్ కుమార్ తరచూ ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ వేధింపుల కారణంగా నిశారాణి పలుమార్లు మెదక్ జిల్లా నర్సాపూర్లోని తన బంధువుల వద్ద ఆశ్రయం పొందినట్లు పోలీసులు తెలిపారు.ఇటీవల దాంపత్య కలహాలు మరింత తీవ్రరూపం దాల్చడంతో, జూన్ 10న సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో మారుతి నగర్లోని తన నివాసంలోనే నిశారాణిపై తుపాకీతో కాల్పులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.
గతంలోనూ తుపాకీ కేసులో నిందితుడుఅరుణ్ కుమార్ గతంలో అంబర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెం.134/2026లో అక్రమ తుపాకీ కలిగి ఉన్న కేసులో నిందితుడిగా ఉన్నట్లు విచారణలో తేలింది. ఆ కేసులో జ్యుడీషియల్ కస్టడీ అనంతరం విడుదలై తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత కుటుంబ కలహాలు మరింత పెరిగినట్లు పోలీసులు గుర్తించారు.
**గంటల్లోనే ఛేదించిన పోలీసులు** హత్య జరిగిన వెంటనే మల్కాజిగిరి పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, ఇతర కీలక సమాచారాన్ని విశ్లేషించి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఈ క్రమంలో జూన్ 11న ఉదయం మౌలాలి రైల్వే స్టేషన్ సమీపంలో ప్రధాన నిందితుడు అరుణ్ కుమార్ను అదుపులోకి తీసుకున్నారు.నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు,ఒక దేశీయ తయారీ పిస్టల్,మూడు సజీవ తూటాలు ఉన్న మ్యాగజైన్,ఒక స్టెయిన్లెస్ స్టీల్ బటన్ నైఫ్,రెండు స్టెయిన్లెస్ స్టీల్ కత్తులు,ఒక సర్జికల్ బ్లేడ్,ఒక మారుతి బలెనో కారు,ఒక బజాజ్ చేతక్ స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఆధ్వర్యంలో, జాయింట్ కమిషనర్ సి. శ్రీధర్, అదనపు డీసీపీ రామ్ కుమార్, ఏసీపీ వి. యాదగిరి రెడ్డి, ఇన్స్పెక్టర్ బి. సత్యనారాయణ, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ సి. శ్రీను, ఏఎస్ఐ బి. సుబ్బరాజు, హెడ్ కానిస్టేబుల్ బి. శ్రీనివాస్, పీసీలు ఎస్. యెల్లా స్వామి, ఎం. షానూర్ బాబు తదితరుల ప్రత్యేక బృందం సమన్వయంతో కేసును ఛేదించింది. కేసును వేగంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.కుటుంబ హింస, బెదిరింపులు, అక్రమ ఆయుధాల వినియోగం వంటి ఘటనలను వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100 / 112కు తెలియజేయాలని మల్కాజిగిరి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కుటుంబ వివాదాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణనష్టం, ఆస్తి నష్టం వంటి తీవ్ర పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.అక్రమ తుపాకులు, ప్రాణాంతక ఆయుధాలను కలిగి ఉండటం, రవాణా చేయడం, వినియోగించడం వంటి చర్యలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు తమ పరిసరాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలు, అక్రమ ఆయుధాల సమాచారం, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికల గురించి పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## చెన్నవరం ఉరుసు మహోత్సవం జయప్రదం



**పోరుమామిళ్ల** బద్వేల్ నియోజకవర్గం కాశినాయన మండలంలోని చెన్నవరం గ్రామం కాశినాయన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుల్లూరు పెద్ద ఖాజావల్లి ఆహ్వానం మేరకు వెళ్లి దస్తగిరి స్వామి ఉరుసు మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి విజయ జ్యోతి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా మహిళా అధ్యక్షురాలు సుభాన్ బి పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ , బద్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లూరు భాష, దేశి రెడ్డి రమణారెడ్డి ,జల్లి రవిచంద్ర , చౌడేశ్వరావు , ఇటుకులపాడు మాజీ ఎంపిటిసి లక్ష్మయ్య, రఫీ, అస్లాం, నాయబ్ రసూల్ , చిన్న శ్రీరాములు, ముజాహిద్ , రమణయ్య మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేశారు

## ఫ్యాక్షన్ గ్రామాల్లో మొహరం వేడుకలకు ముందస్తు పోలీస్ అనుమతి తప్పనిసరి

**- పత్తికొండ టౌన్ సిఐ జయన్న**

**పత్తికొండ** రాబోయే మొహరం పర్వదినాన్ని దృష్టిలో ఉంచుకుని పత్తికొండ టౌన్ పరిధిలోని ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పత్తికొండ టౌన్ సిఐ జయన్న తెలిపారు.ఫ్యాక్షన్ గ్రామాల్లో మొహరం ఊరేగింపులు, సవారీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించే ముందు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. 1. ఊరేగింపు రూట్, సమయం, పాల్గొనే వారి వివరాలతో దరఖాస్తు సమర్పించాలి.2. సౌండ్ సిస్టమ్స్, బహిరంగ సభలు, కార్యక్రమాలకు ప్రత్యేక అనుమతి తప్పనిసరి.3. కత్తులు, లాఠీలు, పేలుడు పదార్థాలు, ఇతర ఆయుధాలు తీసుకురావడం నిషేధం.4. రెచ్చగొట్టే నినాదాలు, పాటలు, వ్యాఖ్యలు చేయరాదు5. పోలీసులు సూచించిన మార్గాలు, సమయ పరిమితులు తప్పనిసరిగా పాటించాలి.మొహరం పర్వదినాన్ని సామరస్యంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని,ఎవరైనా చట్ట ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ జయన్న హెచ్చరించారు.గ్రామ శాంతి కమిటీ సభ్యులు, పెద్దలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## పోలీస్ కమిషనరేట్ మోటార్ ట్రాన్స్పోర్ట్ విభాగంలో నూతన పరికరాలను ప్రారంభించిన: సీపీ గౌష్ ఆలం







**కరీంనగర్** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని మోటార్ ట్రాన్స్పోర్ట్ విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక పరికరాలను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గురువారం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.కమిషనరేట్ వాహనాల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు గాను రూపొందించిన 'టూ పోస్ట్ హైడ్రాలిక్ లిఫ్ట్' మరియు 3 హెచ్.పి కంప్రెషర్తో కూడిన టైర్ చేంజర్ టూల్'లను సీపీ పరిశీలించి,వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు.?ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ?మోటార్ ట్రాన్స్పోర్ట్ గ్యారేజ్ నందు ఈ నూతన పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఇక్కడ పనిచేసే మెకానిక్లకు వాహనాల రిపేర్ పనులు సులభతరం అవుతాయి. ఈ హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా వాహనాన్ని సులభంగా పైకి లేపి, కింది భాగంలో ఉండే ఎలాంటి మరమ్మత్తులనైనా ఎంతో సురక్షితంగా, వేగంగా చేసుకునే వీలుంటుంది. అలాగే 3 హెచ్.పి కంప్రెషర్ టైర్ చేంజర్ టూల్ ద్వారా వాహనాల టైర్ల మార్పిడి ప్రక్రియ మరింత సులభం కానుందన్నారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, పోలీస్ వాహనాలు ఎల్లప్పుడూ కండిషన్లో ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు త్వరితగతిన అందుబాటులో ఉంటాయని సీపీ పేర్కొన్నారు. గ్యారేజ్ నిర్వహణను, వాహనాల భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్మడ్ రిజర్వు విభాగానికి ఏసీపీ ప్రతాప్, ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, రిజర్వు ఇన్స్పెక్టర్లు మేడ కిరణ్ కుమార్, రజినీకాంత్, శ్రీధర్ రెడ్డి కమిషనరేట్ మోటార్ ట్రాన్స్పోర్ట్ విభాగానికి చెందిన అధికారులు, మెకానిక్లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## ఎస్ ఐ ఆర్ వల్ల నిజమైన ఓటర్లకు లబ్ది

**- బద్వేల్ నియోజకవర్గం లో 100% ఓట్లు పోలింగ్ కావడమే మా లక్ష్యం**

**- బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్**




**బద్వేలు** బద్వేల్ నియోజకవర్గం లో 2029 ఎలక్షన్లలో 100% పోలింగ్ జరగడమే మా లక్ష్యమని ఆ లక్ష్యం నెరవేరాలంటే ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు బద్వేల్ ఆర్డీవో కార్యాలయంలో ఎస్ ఐ ఆర్ పైన బద్వేల్ గోపవరం మండలాల ఎమ్మార్వో లకు రెవిన్యూ సిబ్బందికి ,బిఎల్ఓలకు జరిగిన కార్యక్రమంలో బద్వేల్ ఆర్డీవో ముఖ్యఅతిథిగా పాల్గొని సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది అందులో భాగంగా ఎమ్మార్వోలకుఎస్ ఐ ఆర్ వల్ల నిజమైన ఓటర్లకు లబ్ధి చేకూరుతుందని గురువారం ఆర్డిఓ చంద్రమోహన్ తెలిపారు అంతేకాకుండా నియోజకవర్గంలో రెండు లక్షల 20వేల పైచిలుకు ఓట్లు ఉన్నాయి దీనిలో చాలా వరకు ఇప్పటికే చనిపోయిన వారిని గుర్తించామని అంతేకాకుండా బద్వేల్ నియోజకవర్గం లో ఓటు ఉండి ఇతర నియోజకవర్గాల్లో ఓటు ఉన్న లేక ఇతర నియోజకవర్గాల్లో ఓటు ఉండి ఇక్కడ ఓటు ఉన్నా ఏదైనా ఒక ఓటు మాత్రమే ఉండాలని ఎన్నికల కమిషన్ నిబంధన అని దాని ప్రకారం బి ఎల్ వో లు ప్రతి ఇంటికి వెళ్లి ఒకటికి మూడుసార్లు సవరణ చేయాలని అంతేకాకుండా రాజకీయ పార్టీలను భాగస్వాములు చేసుకొని ముందుకు సాగాలని ఎమ్మార్వోలకు రెవెన్యూ సిబ్బందికి బిఎల్ఓ లకు శిక్షణా కార్యక్రమంలో ఆయన గట్టిగా దిశ నిర్దేశం చేశారు ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తేవాలని అంతేకానీ సొంత నిర్ణయాలతో ఓట్లను తీసివేయవద్దని తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని అలా తీసుకున్న వారు బాధ్యత వహించాలని ఎలక్షన్ కమిషన్ ఎస్ ఐ ఆర్ మన రాష్ట్రంలో 2002 సంవత్సరంలో జరపారు అప్పటినుండి ఇప్పటివరకు జరపలేదు కాబట్టి ఇప్పుడు 2026 సంవత్సరం లో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రతి ఒక్కరిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు ఈ కార్యక్రమంలో గోపవరం బద్వేల్ ఎమ్మార్వోలు డీటీలు వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**- పోరుమామిళ్ల తాసిల్దార్ విజయ్ కుమార్**



**పోరుమామిళ్ల** బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల లోని పద్మావతి కళ్యాణ మండపం లో శుక్రవారం జరగబోయే ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండలంలోని అన్ని శాఖల అధికారులకు పోరుమామిళ్ల మండల తాసిల్దార్ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు ఇందులో బాగా శుక్రవారం జరగబోయే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ , జాయింట్ కలెక్టర్ నిధిమీనా, మరియు జిల్లా అధికారులు ,బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ లు పాల్గొంటున్నారని అందువల్ల ప్రతి మండలాధికారి తప్పనిసరిగా హాజరుకావాలని ఎవరైనా హాజరుకాకుంటే వారికి మేము బాధ్యులంకామని అంతే కాకుండా ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా ఈ కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు అంతేకాకుండా ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై వారి సమస్యలు కలెక్టర్ గారి దృష్టికి స్వచ్ఛందంగా చెప్పుకోవచ్చని వారు తెలిపారు

## అక్రమ టేకు రవాణా

**- వాహనంతో సహా దుంగలు స్వాధీనం**




**దేవీపట్నం** అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను ఫారెస్ట్ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఓ మినీ ట్రక్కులో టేకు దుంగలను అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. వాహనం నిండా దుంగలు లోడ్ చేసి ఉన్నాయి, మరికొన్ని కింద పడి ఉన్నాయి. అధికారుల చర్యలుఫారెస్ట్ శాఖ అధికారులు వాహనంతో సహా మొత్తం టేకు దుంగలను సీజ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న టేకు విలువ లక్షల్లో ఉంటుందని అంచనా.అధికారుల హెచ్చరికటేకు వంటి విలువైన కలపను అక్రమంగా నరికివేత, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## గంగపాలెంలో పెద్దపులి సంచారం



**దేవీపట్నం** అటవీ ప్రాంతంలో రేడియో కాలర్ అమర్చిన పెద్దపులి సంచరిస్తుండటంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.గత కొన్ని రోజులుగా మండలంలోని అటవీ సమీప గ్రామాల్లో పెద్దపులి జాడలు కనిపించాయి. ఫారెస్ట్ శాఖ అమర్చిన ట్రాప్ కెమెరాల్లో పులి కదలికలు రికార్డు అయ్యాయి. ఫోటోలో కనిపిస్తున్నట్లు పులి మెడకు రేడియో కాలర్ ఉంది. దీన్ని బట్టి అటవీ శాఖ అధికారులు పులి కదలికలను ట్రాక్ చేస్తున్నట్లు తెలుస్తోంది.విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు గ్రామాల్లో పర్యటించారు. పులి పాపికొండలు అభయారణ్యం నుంచి వచ్చి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని సూచించారు. పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు గమనించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ట్రాప్ కెమెరాలు, సిబ్బందితో నిఘా పెంచామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తెలిపారు. ప్రజలు ఎవరైనా పులిని చూస్తే వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్గా డాక్టర్ ఆది శ్రీకాంత్



**బద్వేల్** బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్గా డాక్టర్ ఆది శ్రీకాంత్ నేడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు రోగులకు నాణ్యమైన చికిత్స అందించేందుకు కృషి చేస్తామని డాక్టర్ ఆది శ్రీకాంత్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**- ఎమ్మెల్యే భూమా**

**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక మరియు అభివృద్ధి సంబంధిత సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే కు అందజేశారు.ప్రజల నుండి నేరుగా వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే ప్రతి అర్జీని పరిశీలించి, సమస్యలను ఓర్పుగా విన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని, నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని, ప్రజల సంక్షేమం, అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

# ప్రజల విశ్వాసం.. అభివృద్ధి ఫలితం

# రెండేళ్ల అచ్చెన్న పాలనకు ప్రశంసలు

**- రెండేళ్ల ప్రగతి ప్రస్థానం. గత పాలకులకు చెంప పెట్టు**

**- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనాయకుడు, మంత్రి నారా లోకేష సహకారంతో అభివృద్ధి**

**- వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చిన మంచి మనిషి.**

**-వ్యవసాయానికి పెద్దపీట.. అభివృద్ధికి కొత్త బాట అచ్చెన్న రెండేళ్ల పాలన ప్రత్యేకత**

**-టెక్కలి నియోజకవర్గంలో వందల కోట్ల పనులకు ఆద్యుడు**



టెక్కలి(ప్రశ్న న్యూస్) గతం కన్నా భిన్నంగా ఉంటే అది ఒక కొత్త చరిత్రకు కారణం అవుతుంది. కొత్త ఆలోచనకు నాంది అవుతుంది. రెండేళ్ల కూటమి పాలనలో అభివృద్ధి, వికాసం అన్నవి రెండు కళ్లుగా ఉన్నాయి. వికాసం అంటే చదువుకు సంబంధించి అని అర్థం. అభివృద్ధి అంటే సామాజిక అభివృద్ధితో పాటే ప్రభుత్వ ఆస్తుల విస్తరణ వాటి వినియోగం, వాటిలో చేయాల్సిన మార్పులు, కొత్త భవనాల కూర్పు అన్నవి ఎంతో బాగున్నాయి అని కింజరాపు అభిమానులే కాదు నియోజకవర్గ ప్రజలు సైతం చెబుతున్నారు.

### గ్రామీణ రహదారులు రహదారుల అభివృద్ధే ధ్యేయం

ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లు ప్రధానం అయిన విషయంగా అజెండాగా తీసుకుని మారుమూల ప్రాంతాలను సైతం కలిపే విధంగా రోడ్లు వేయడం ఓ మంచి ప్రయత్నం శుభ పరిణామం. ముఖ్యంగా రహదారుల కోసం ముఖ్య రహదారుల కోసం కోటబొమ్మాళి, టెక్కలి, సంతబొమ్మాళిలో నిధులు వెచ్చించారు. 700 రూ. వందల కోట్ల రూపాయల నిధుల వెచ్చింపులో భాగంగా ప్రధాన రహదారుల విస్తరణకు శ్రీకారందిద్దారు.

అలానే రెండు కోట్ల రూపాయలు వెచ్చించి కోటబొమ్మాళి ఎత్తిపోతల పథకానికి సంబంధించి ట్రాన్స్ ఫార్మర్ పునరుద్ధరణకు నిధులు కేటాయించి ఆ రోజు సంబంధిత ప్రక్రియకు ప్రాణం పోశారు.

కోటబొమ్మాళిలో చీపుర్లపాడు వద్ద పది కోట్ల రూపాయలతో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేశారు. సంతబొమ్మాళి, టెక్కలి మండలం ఎత్తిపోతల పథకానికి సంబంధించి దృష్టి సారించారు. రూ, 7 , కోట్ల 88 లక్షల రూపాయలతో కొండపేట, మదన గోపాల సాగరం వద్ద ఎత్తి పోతల పథకం పునరుద్ధణకు నిధులు మంజూరుచేశారు.

### పేదలకు అన్నం పడుతున్న అన్నా క్యాంటీన్లు

కోటబొమ్మాళి టెక్కలిలో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా టెక్కలి నియోజకవర్గంలో రెండు అన్నా క్యాంటీన్లకు శ్రీకారం దిద్దారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో వారి నిర్దేశకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు అయిన ఈ పథకంతో ఐదు రూపాయలకే పేదలకు పట్టెడన్నం నాణ్యమయిన భోజనం, మూడు పూటలా ఆహారం అందేవిధంగా ఏర్పాటు చేయడం ఓ గొప్ప పరిణామం. అధినేత స్ఫూర్తి అందుకుని తన వంతుగా అచ్చెన్న నియోజకవర్గంలో రెండు క్యాంటీన్లు ఏర్పాటు చేయడం, వీటితో పాటే నిర్వహణకు సంబంధించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడం మంచి పరిణామాలకు సంకేతం. అన్నా క్యాంటీన్ల ఏర్పాటు నిమిత్తం ఆయన ఎంతో కృషి చేసి నియోజకవర్గ ప్రజా ప్రతినిధుల, ప్రజల మన్ననలు అందుకున్నారు.

## మాజీ మేయర్ ఇంటి ముందు కూల్చివేతలు

**కడప** కడపలో మాజీ మేయర్ పాకా సురేష్ ఇంటి ముందు వేసుకున్న ఇంటర్లాకింగ్ టైల్స్ను అధికారులు పొక్లెయిన్తో తీసేయించారు. ఎవరికీ అడ్డుకాకపోయినా.. కేవలం కక్షసాధింపుతో తొలగించారిన మాజీ మేయర్ కుటుంబం ఆరోపించింది. కడపలో ఎమ్మెల్యే బుల్డోజర్ రాజకీయం చేస్తోందంటూ వైసీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. గతంలో వైసీపీ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఇంటి ముందున్న కాల్వలు తొలగించాలంటూ హడావుడి జరిగింది. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా కూల్చేవేతలు జరుగుతున్నాయిని ఆరోపించారు.

## ఆ పెట్రోల్‌పై ఎక్సైజ్ డ్యూటీ ఎత్తివేత

**న్యూఢిల్లీ** ఇథనాల్ బ్లెండింగ్ పెట్రోల్ను ప్రోత్సహించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. అధిక ఇథనాల్ కలిపిన పెట్రోల్ పై అన్ని రకాల ఎక్సైజ్ సుంకాలను మాఫీ చేసింది. ఈ మేరకు 22%, 25%, 27%, 30% ఇథనాల్ కలిసిన పెట్రోల్ పై కేంద్ర ఎక్సైజ్ సుంకం, ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం, రోడ్డు-మౌలిక సదుపాయాల సెస్, వ్యవసాయ మౌలిక సదుపాయాలు-అభివృద్ధి సెస్లను ఎత్తివేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది.

## ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల కరపత్రాలు విడుదల

**- రెండేళ్ల కూటమి పాలనలో విద్యా వ్యవస్థకు ఒరిగిందేమీ లేదు**

**- పీజీ విద్యకు ఆటంకంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలి**

**- ఏఐఎస్ఎఫ్ నాయకులు స్పష్టం**




**పిడుగురాళ్ల** కర్నూలు నగరం మల్లయ్య లింగం భవన్ నందు జులై 1 నుంచి 4వ తేదీ వరకు జరగనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని గురువారం పిడుగురాళ్ల పట్టణంలోని ఎస్టియు కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఇచ్చేటువంటి హామీలు అమలు చేయకుండా రాష్ట్రమంతా ఏదో పెద్ద చేశామన్న ఆనందంలో సంబరాలు చేసుకుంటున్నారు అని విమర్శించారు. మాకు కావాల్సింది సంబరాలు కాదు విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో మన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే వంద రోజుల్లో పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చే నేటికి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్న ఇంతవరకు జీవో నెంబర్ 77 రద్దు చేయలేదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ పైన మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు సిధిలా వ్యవస్థలోకి చేరాయి అన్నారు. విద్యార్థులు చదువుకుంటున్న సందర్భంలో పైన గోడలకు ఉన్నటువంటి పెచ్చులు ఊడి విద్యార్థుల తలలు పగిలేతట్టువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో చాలా పాఠశాలల్లో కనబడతా ఉంది అన్నారు. వాటి మరమ్మతుల కోసం నిధులు విడుదల చేసి ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయకుండా కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్ర చట్టాన్ని పట్టణ ప్రాంతాలలో, గ్రామీణ ప్రాంతాలలో ఎంత వసూలు చేయాలని ఒక చట్టాన్ని తీసుకువచ్చినప్పటికీ ఈ రాష్ట్రంలో ఏ ఒక్క ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యులు దాన్ని పాటించకపోవడం లేదని మండిపడ్డారు. వైద్య, విద్యను ప్రైవేటీకరణ ఆపాలని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది పేద మధ్య తరగతి తల్లితండ్రులు తమ కూతుర్లు కొడుకులు మంచి కోచింగ్ పంపిస్తే నీట్లో ర్యాంకు వస్తే డాక్టర్లు అవుతారన్న ఆనందం ఉంటే దేశవ్యాప్తంగా మొన్న జరిగినటువంటి నీటి ప్రవేశ పరీక్ష లీకైతే మన రాష్ట్రంలో ఉన్న విద్యాశాఖ మంత్రి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం సరైనది కాదని మండిపడ్డారు అంటే ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యార్థుల బాధలు కష్టాలు మీకు అవసరం లేదా అని నారా లోకేష్ ను ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా హైస్కూల్ ప్లస్ ఇంటర్ విద్యార్థికి సంబంధించి గర్ల్స్ కి 20094 పాఠశాలలకు గాను 250 పాఠశాలలోనే కొనసాగుతూ, అబ్బాయిలకు సంబంధించి 210 పాఠశాలలకు గాను 114 పాఠశాలలు మాత్రమే కొనసాగుతూ ఇంటర్ పాస్ పర్సంటేజ్ 55 శాతానికి మించినటువంటి దయనీయ సమస్యలల్లో ఇంటర్ ప్లస్ పాఠశాల విద్యా విధానం కొనసాగుతున్నదని అన్నారు. అర్హత, అనుభవం లేని అధ్యాపకుల ద్వారా విద్యా బోధన చేయడం వల్ల ఇలాంటి పరిస్థితులు ఉన్నా కూడా కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్య పైన దృష్టి పెట్టకుండా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. పైగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ విద్యను పరిరక్షిస్తున్నాము ముందుకు తీసుకెళుతున్నామని ప్రకటనలకే పరిమితమయ్యారు. జులై 1 నుంచి 4వ తేదీ వరకు జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర శిక్షణ తరగతులలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్నటువంటి విద్యా వ్యతిరేక విధానాల పైన చర్చించి రాష్ట్రవ్యాప్తంగా సమరశీల పోరాటాలకు శ్రీకారం చేస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మధు, నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, నజీర్ తదితరులు పాల్గొన్నారు

## పారదర్శక దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి

**- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



**రాజన్న సిరిసిల్ల** వేములవాడ సబ్-డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతి, నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలు, పోలీసు సిబ్బంది పనితీరు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ .....జిల్లాలో నమోదయ్యే ప్రతి కేసులో పారదర్శకంగా, నిష్పాక్షికంగా దర్యాప్తు నిర్వహించి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను గుర్తించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో అవసరమైతే న్యాయ సలహాలు తీసుకుని దర్యాప్తును వేగవంతం చేయాలని పేర్కొన్నారు. పెండింగ్ నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రతిరోజూ పర్యవేక్షణ నిర్వహించి, నిందితుల అరెస్టులో నిర్లక్ష్యానికి తావివ్వవద్దని స్పష్టం చేశారు. పోలీసుల ప్రవర్తనే శాఖ ప్రతిష్ఠను నిర్ణయిస్తుందని, విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి సీఐ , ఎస్.ఐ తమ పరిధిలో స్థానిక ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పోలీసు శాఖపై విశ్వాసాన్ని పెంపొందించేలా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఎస్పీ లు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు , సి.ఐ లు వీరప్రసాద్, శ్రీనివాస్, మధుకర్, ఎస్.ఐ లు కిరణ్ కుమార్,రమాకాంత్, రమేష్, రామ్మోహన్, ప్రేమనందం, మోతిరాం, సిబ్బంది పాల్గొన్నారు

## కసిరెడ్డి మళ్లీ అరెస్ట్

**విజయవాడ** ఏపీ లిక్కర్ స్కామ్' కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది. ఈ అరెస్టుకు ముందు తెలుగు రాష్ట్రాల్లోని పలువురు ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాలపై ఈడీ ఏకకాలంలో భారీ దాడులు నిర్వహించింది. రాజ్ కెసిరెడ్డితో పాటు మరో ఆరుగురు కీలక వ్యక్తుల నివాసాల్లో సోదాలు చేసింది. వీటిలో ఏపీఎస్‌బీసీఎల్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ డి. వాసుదేవ రెడ్డి, ఆయన బంధువు నరసింహారెడ్డి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తదితరులకు చెందిన కార్యాలయాలు, నివాస ప్రాంగణాలు ఉన్నాయి. ఈ స్కామ్‌కు సంబంధించి ఈడీ నమోదు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) లో మొత్తం 33 మందిని నిందితులుగా చేర్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ భారీ మద్యం కుంభకోణం జరిగినట్లు ఈడీ ప్రాథమిక ఆధారాలు సేకరించింది. డిస్టిలరీలు, మద్యం సరఫరాదారుల నుంచి వేల కోట్ల రూపాయలను లంచాల రూపంలో అక్రమంగా వసూలు చేశారని ఈడీ స్పష్టం చేసింది. దాదాపు రూ. 3,200 కోట్ల రూపాయలను లంచాల రూపంలో వసూలు చేసి, వాటిని పట్టుబడకుండా ఉండేందుకు పలు నకిలీ, షెల్ కంపెనీల ద్వారా చేతులు మార్చారని ఈడీ గుర్తించింది. ఈ మద్యం సిండికేట్ వెనుక ఉన్న అసలు దొంగలు ఎవరు? ఈ వేల కోట్ల రూపాయల హవాలా డబ్బు చివరికి ఎవరి జేబుల్లోకి వెళ్ళింది? అనే కోణంలో ఈడీ విచారణను మరింత వేగవంతం చేసింది.

## స్టీల్ ప్లాంట్‌లో తప్పిన ముప్పు

**విశాఖపట్టణం** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లో వరుసగా జరుగుతున్న ఘటనలు కార్మికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. మూడు రోజుల క్రితం జరిగిన భారీ ప్రమాదంలో 9 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయిన విషాదం ఇంకా మరువక ముందే.. ఈ తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ప్లాంట్‌లో మరో ప్రమాదం చోటుచేసుకుంది. భారీ ప్రమాదం త్రుటిలో తప్పింది. ఎస్ఎమ్ఎస్-1 విభాగంలోని ఆర్గాన్ రిన్సింగ్ స్టేషన్ వద్ద లాడిల్ నుండి ద్రవ ఉక్కు ఒక్కసారిగా లీకైంది. అయితే, లీకేజీ జరిగిన సమయంలో అక్కడ కార్మికులు ఎవరూ లేకపోవడంతో మరో పెద్ద ప్రాణ నష్టం, ముప్పు తప్పినట్లయింది. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే అలాంటి ఘటన పునరావృతం కావడంతో స్టీల్ ప్లాంట్ కార్మికులు, కార్మిక సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జూన్ 8న ఎస్ఎమ్ఎస్-2 విభాగంలో లాడిల్ నుండి ద్రవ ఉక్కు పొంగిపొర్లడం వల్ల 9 మంది అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. పలువురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ మరణాల నేపథ్యంలో ఇప్పటికే కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబాలకు భారీ ఎక్స్‌గ్రేషియా అందించింది. మృతుల కుటుంబాల్లో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ప్రకటిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

## బౌరంపేటలో చోరీలు

**కుత్బుల్లాపూర్** దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి,బౌరంపేట లో రాత్రి తాళాలు వేసిన ఇండ్లలో దొంగ తనానికి పాల్పడ్డాడు ఓ వ్యక్తి.చిరుద్యోగి రవి అనే వ్యక్తి ఉంటున్న ఇంటి తాళం పగలగొట్టి చోరీ కి దుండగుడు పాల్పడ్డాడు. 35000, రూపాయలు 3.5 తులాలు బంగారం అపహరణకు గురయ్యాయి. దాంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. మరో ఇంట్లో 1 లక్ష 30 వేల నగదు చోరీ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు బాధితులు. ఉదయం 3 గంటల ప్రాంతంలో దొంగ తనానికి వచ్చిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో, దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

## కోడిపందాల స్థావరంపై పోలీసులు దాడి

**కాకినాడ** జగ్గంపేట మండలం జె. కొత్తూరు శివారున రహస్యంగా కోడిపందాలు ఆడుతున్నట్లు సమాచారం మేరకు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు సిబ్బందితో దాడులు నిర్వహించారు.. కోడిపందాల స్థావరం పై నిర్వహించిన దాడుల్లో నలుగురు పందెం రాయుళ్లను, రెండు కోడి పుంజులను,రెండు కోడి కత్తులను,2 వేల 50 రూపాయల (2,050/)నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు.. జగ్గంపేట మండల పరిధిలో ఎక్కడైనా రహస్యంగా కోడిపందాలు,పేకాట, జూధాలు నిర్వహించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు..

## కలెక్టరేట్ ముందు ఏఐవైఎఫ్ ధర్నా

**మేడ్చల్** కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని అదే విధంగా రాష్ట్రంలోని అన్ని శాఖలపై శ్వేత పత్రం విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేసి శాశ్వత ఉద్యోగాల ద్వారా యువతకు భరోసా కల్పించాలని అదే విధంగా ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలుచేయాలని ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఒఎజఈ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు...

## నాచారంలో బీజేపీ నేతల ప్రత్యేక పూజలు

**మేడ్చల్** :నరేంద్ర మోదీ భారతదేశంలో అత్యధిక కాలం 4,399 రోజులు నిరంతరాయంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా చారిత్రక రికార్డు సృష్టించడంతో దేశం మరింత అభివృద్ధి చెందాలని కాంక్షిస్తూ నాచారం లో బీజేపీ నేతలు స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలకు సిర్పూర్ ఖాగజ్ నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్యేక పూజలు నిర్వహించి మోదీ దీర్ఘాయుష్ తో జీవించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా పాల్వాయి హరీష్, రవి నాయక్ మాట్లాడుతూ మోదీ దేశానికి నిరంతరం సేవలు అందించాలని మరియు 'వికసిత భారత్' ఆశయం నెరవేరాలని ప్రార్థించారు. ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో, మోదీ నాయకత్వంలో దేశానికి స్థిరమైన పాలన లభించడం గర్వకారణమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై అత్యధిక కాలం పనిచేసిన ప్రధానమంత్రిగా మోదీ ఒక సరికొత్త మైలురాయిని చేరుకున్నారని వారు కొనియాడారు...

## పాతకక్షల నేపధ్యంలో దాడి

**- ఒకరికి తీవ్ర గాయాలు**

**పల్నాడు** రెంటచింతల మండలం తుమ్రుకోటలో దారుణం జరిగింది. పాతకక్షల నేపధ్యంలో దాడి జరిగింది. అర్ధరాత్రి ఇంటి డాబాపై నిద్రిస్తున్న ఆలేటి కోటేశ్వరరావుపై కర్రలు,గొడ్డళ్లతో దాడి చేసారు. దుండగుల దాడిలో కోటేశ్వరరావు తల, రెండు కాళ్ళకు తీవ్ర గాయాలు అయ్యాయి. కోటేశ్వరరావు పరిస్థితి విషమం,మాచర్ల ఆసుపత్రికి తరలించారు. తనపై ప్రత్యర్థులే దాడి చేశారని బాధితుడు కోటేశ్వరరావు ఆరోపణ. రెంటచింతల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి పాత కక్షలే కారణంగా పోలీసులు, గ్రామస్తులు భావిస్తున్నారు..

## రెండు లారీలు ఢీ..డ్రైవర్ సజీవ దహనం

**నిర్మల్** నిర్మల్ మండలం మేడిపల్లి గ్రామం వద్ద నేషనల్ హైవే 44 పై బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ టైరు పంచర్ కావడంతో రోడ్డుపైన ఆగింది. ఆగి ఉన్న లారీని హైదరాబాద్ కు జొన్నల లోడు తీసుకుని వెళుతున్న మరో లారి ఢీకొంది. ప్రమాదంలో జొన్నల లోడ్డుతో వెళ్తున్న లారీలోమంటలు చిలరేగాయి. లారీ డ్రైవర్ ఆదిలాబాద్ జిల్లా సోనాల మండల కేంద్రానికి చెందిన జవారి సింగ్ సజీవ దహనం అయ్యాడు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటన స్థలికి చేరుకుని మంటలను అదుపు చేసారు. లారీలు ఢీకొన్న ప్రమాదాన్ని చూస్తూ పక్కనుంచి అదిలాబాద్ వైపు వెళ్తూ ఎదురుగా వస్తున్న లారీని ఇన్నోవా ఢీకొంది. కారు, డ్రైవర్ కాళ్లు విరిగాయి. భాధితుడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. .

## రోడ్డు విస్తారణ పనులను పరిశీలించిన మంత్రి పొన్నం




**హుస్నాబాద్** హుస్నాబాద్ నుండి కరీంనగర్ వెళ్లే కొత్తపల్లి రాజీవ్ రహదారి వరకు నిర్మితమవుతున్న ఫోర్ లేన్ రోడ్డు విస్తరణ పనులను మంత్రి పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ పోల్స్ తొలగించి వాటి స్థానం లో నిర్మిస్తున్న విద్యుత్ టవర్స్ పనులను పరిశీలించి విద్యుత్ తీగల స్తంభాల తొలగింపు పై సిబ్బంది తో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. తరువాత రహదారి విస్తరణ లో భాగంగా కొండాపూర్ గ్రామ శివారుల్లో నిర్మితమవుతున్న కల్వర్టులను పరిశీలించారు. రోడ్డు విస్తరణ లో పెండింగ్ లో ఉన్న కల్వర్టులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం ప్యాకేజీ 1,2 కింద 163.20 కోట్లు మంజూరు చేసింది .కొత్తపల్లి నుండి సందరగిరి 10 కిమీ రోడ్డు విస్తరణకు ప్యాకేజీ -1 కింద 86 కోట్లు మంజూరు చేసింది. సుదరగిరి నుండి హుస్నాబాద్ కి ప్యాకేజీ 2 కింద 77.20 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు.

## తెలంగాణలో ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

హైదరాబాద్ తెలంగాణలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. మొదటి సంవత్సరంలో 68.84 శాతం, రెండవ సంవత్సరంలో 49.29 శాతం ఉత్తీర్ణత నమోదయింది. సప్లిమెంటరీ ఫలితాల్లోనూ బాలికలదే పైచేయి సాధించారు. బాలికల ఉత్తీర్ణత శాతం మొదటి సంవత్సరంలో 76.10.. రెండవ సంవత్సరంలో 52.56 శాతం, బాలుర ఉత్తీర్ణత శాతం మొదటి సంవత్సరంలో 62.57.. రెండవ సంవత్సరంలో 47.45 శాతం వుంది. రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలకు 3,98,459 మంది విద్యార్థులు హజరయ్యారు.

## పెద్ది' చిత్రానికి కాసుల వర్షం.. ఆరు రోజుల్లోనే అరుదైన రికార్డు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వచ్చిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా విడుదలైన కేవలం ఆరు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టి దూసుకుపోతోంది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమాకు తొలిరోజు నుంచే మంచి టాక్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా వసూళ్ల వివరాలను నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ అధికారికంగా ప్రకటిస్తూ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ భారీ విజయం పట్ల చిత్రబృందం ఆనందం వ్యక్తం చేసింది. ఈ సినిమాలో రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి విశేష ప్రశంసలు దక్కుతున్నాయి. ఆయన కెరీర్‌లో ఇదొక గుర్తుండిపోయే పాత్రగా నిలుస్తుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. దీనికి తోడు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటించగా, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ, రవికిషన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించి తమ నటనతో ఆకట్టుకున్నారు.


## దర్శకుడి ఆరోపణలపై స్పందించిన నటి వరలక్ష్మీ శరత్‌కుమార్

తనపై దర్శకుడు సంజీవ్ మేగోటి చేసిన ఆరోపణలను నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ తిప్పికొట్టారు. ఆయన దర్శకత్వంలో ఆమె నటించిన 'పోలీస్ కంప్లైంట్' చిత్రం జూన్ 12న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్ కు వరలక్ష్మి సహకరించలేదని, డబ్బులు తీసుకొని కూడా ఇంటర్వ్యూలు ఇవ్వకపోవడం వల్ల భారీ నష్టం వాటిల్లిందని దర్శకుడు ఇటీవల ఆరోపించారు. ఈ వివాదంపై వరలక్ష్మి స్పందిస్తూ... చిత్ర బృందానికి అవసరమైనప్పుడల్లా తాను అందుబాటులోనే ఉన్నానని, సినిమాకు సంబంధించిన వేడుకల్లో పాల్గొన్నానని స్పష్టం చేశారు. వేదికపై దర్శకుడు ఏం మాట్లాడారో తనకు పూర్తిగా తెలియదన్నారు. కొన్ని విషయాల్లో తనకంటూ సొంత అభిప్రాయాలు ఉంటాయని, అందుకే చిత్రబృందం చేస్తున్న ఆరోపణల గురించి బహిరంగంగా చర్చించి వివాదాన్ని పెద్దది చేయడం ఇష్టం లేదని తెలిపారు. తాను అందరిలా ఆరోపణలు చేయలేనని పేర్కొన్నారు. తన పని తాను చూసుకుంటూ ముందుకు వెళతానని ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన నోట్ ద్వారా స్పష్టం చేస్తూ ఈ వివాదానికి చెక్ పెట్టే ప్రయత్నం చేశారు.



## ఎవరికీ తట్టని ఆలోచన!

లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'సింగ్ గీతం'. ప్రముఖ నిర్మాత నాగ్‌అశ్విన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా తొలిటికెట్‌ను అగ్ర దర్శకుడు రాజమౌళి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాత నాగ్‌అశ్విన్, సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్‌తో కలిసి ప్రత్యేకంగా ముచ్చటించారు. రాజమౌళి మాట్లాడుతూ 'ఈ సినిమా ఐడియాను నా సోదరుడు కీరవాణి ద్వారా 1995లో విన్నాను.తొలిసారి ఈ కథ విని ఆశ్చర్యపోయాను. ఇది పూర్తిగా ఎవరికీ తట్టని ఆలోచనగా అనిపించింది. ఇంత వినూత్నమైన కథను తెరపైకి తీసుకురావడానికి అంతే వినూత్నంగా ఆలోచించే వ్యక్తి కావాలి. ఆ పని చేయడానికి నాగ్‌అశ్విన్ సరైన వ్యక్తి' అని అన్నారు. ప్రేక్షకులు వెండితెరపై చూసి ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన చిత్రమిదని నాగ్‌అశ్విన్ అన్నారు. ఈ సినిమా కోసం ముందుగానే సంగీత ప్రపంచాన్ని నిర్మించామని, ఈ ప్రక్రియలో వందలాది ట్యూన్స్ కంపోజ్ చేశామని సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ తెలిపారు.



## నాని 'ది ప్యారడైజ్' షూటింగ్ ఆలస్యం.. రెండు పార్టులుగా ప్లాన్ చేస్తున్నారా?



టాలీవుడ్ స్టార్ నటుడు నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన భారీ చిత్రం 'ది ప్యారడైజ్'. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ 'దసరా' తర్వాత వస్తున్న సినిమా కావడంతో, ఈ ప్రాజెక్ట్‌పై ప్రకటన వచ్చిన మొదటి రోజు నుంచే అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటిస్తోంది. అయితే, ప్రస్తుతం ఈ సినిమా చుట్టూ ఫిలిం నగర్ సర్కిల్స్‌లో ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. సినిమా షూటింగ్ ఊహించిన దానికంటే ఎక్కువగా ఆలస్యం అవుతుండడం, మరోవైపు సినిమాపై ఉన్న హైప్ క్రమంగా తగ్గే ప్రమాదం ఉందనే ఆందోళన అభిమానుల్లో వ్యక్తమవుతుండడమే దీనికి ప్రధాన కారణం.సాధారణంగా నాని సినిమాలు చాలా వేగంగా, పక్కా ప్లానింగ్‌తో పూర్తవుతుంటాయి. కానీ, 'ది ప్యారడైజ్' విషయంలో మాత్రం కథ వేరేలా కనిపిస్తోంది. అనుకున్న సమయానికి సినిమా పూర్తి కాకపోవడం నాని అభిమానులను సైతం తీవ్ర ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఎందుకంటే, ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైనప్పటి నుండి నాని గానీ, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల గానీ, లేదా ఈ చిత్రంలోని ఇతర ముఖ్య నటీనటులు గానీ మరే ఇతర కొత్త సినిమాకూ కమిట్ అవ్వలేదు. అందరూ పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే తమ దృష్టిని కేంద్రీకరించారు. అయినప్పటికీ, గత కొన్ని నెలలుగా నిరంతరాయంగా షూటింగ్ జరుగుతున్నా, ఇంకా దాదాపు రెండు నెలలకు పైగానే టాకీ పార్ట్ మరియు మేజర్ యాక్షన్ షెడ్యూల్స్ బ్యాలన్స్ ఉన్నాయనే సరికొత్త రూమర్స్ ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తున్నాయి.ఈ సుదీర్ఘమైన షూటింగ్ షెడ్యూల్స్ వెనుక ఉన్న అసలు కారణాలపై ఇప్పుడు సరికొత్త ఊహాగానాలు మొదలయ్యాయి. ఇన్ని రోజులుగా చిత్రీకరణ జరుపుకుంటుందంటే, 'ది ప్యారడైజ్' చిత్రాన్ని ఒకేసారి రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి గంటల కొద్దీ భారీ ఫుటేజ్ లభించి ఉంటుందని, కథా పరిధి చాలా పెద్దది కావడం వల్లే దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దీనిని రెండు భాగాలుగా ప్లాన్ చేసి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాకుండా, ఇదొక గ్రాండ్ స్కేల్ పీరియాడిక్ డ్రామా కావడం వల్ల, ఖచ్చితంగా సీక్వెల్స్ చేయడానికి బలమైన స్కోప్ ఉంటుందని కూడా టాక్ నడుస్తోంది. ఏదేమైనా, ఈ రిలీజ్ రూమర్స్ మరియు రెండు భాగాల ప్రచారంపై అసలు నిజం ఏంటనేది చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటిస్తేనే నాని అభిమానులకు పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



## భయపెట్టనున్న జాన్వీ కపూర్

### 'తుంబాడ్' దర్శకుడితో హారర్ జోనర్‌లో కొత్త సినిమా!

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ వరుసగా భారీ ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. తాజాగా ఆమె మరో ఆసక్తికర చిత్రానికి అంగీకరించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

కల్ట్ క్లాసిక్ హారర్ ఫిల్మ్ 'తుంబాడ్' ఫేమ్ దర్శకుడు రాహి అనిల్ బర్వే దర్శకత్వంలో ఓ భారీ క్రీచర్ హారర్ చిత్రంలో నటించేందుకు జాన్వీ చర్చలు జరుపుతున్నట్టు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయని సమాచారం. అంతా సవ్యంగా జరిగితే ఈ ఏడాది చివర్లోనే సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ప్రముఖ నిర్మాణ సంస్థ జియో స్టూడియోస్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. 'తుంబాడ్' తర్వాత రాహి అనిల్ బర్వే హారర్ జోనర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన దర్శకత్వంలో సినిమా అనగానే ప్రేక్షకుల్లోను, పరిశ్రమలోను ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి సంబంధించిన కథ, ఇతర నటీనటుల వివరాలను మేకర్స్ చాలా గోప్యంగా ఉంచుతున్నారు. అయితే, జాన్వీతో చర్చలు ఫలించి, ఆమె ఈ ప్రాజెక్టులో భాగమైతే తన కెరీర్‌లో ఇది మరో ముఖ్యమైన సినిమా అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం రాహి అనిల్ బర్వే పలు హారర్ ప్రాజెక్టులతో బిజీగా ఉండగా, వాటిలో ఇది ఒకటని తెలుస్తోంది. ఈ వార్తలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## 'ఇరుముడి' ఓ అందమైన జ్ఞాపకం

రవితేజ కథానాయకుడిగా రూపొందుతున్న తాజా కుటుంబ కథా చిత్రం 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. ప్రియా భవానీ శంకర్ కథానాయిక. ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్‌కు మంచి స్పందన లభించిందని చిత్రబృందం ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా షూటింగ్ లొకేషన్ నుంచి కొన్ని స్టిల్స్‌ను బుధవారం విడుదల చేశారు. వీటిపై స్పందిస్తూ చిత్ర కథానాయిక ప్రియా భవానీ శంకర్ సోషల్‌మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. 'ఇరుముడి' సినిమా ప్రయాణం ఓ అందమైన జ్ఞాపకమని, ఇది జీవితాంతం గుర్తుండిపోతుందని ఆనందం వ్యక్తం చేసింది. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కుటుంబ అనుబంధాలు, ఆధ్యాత్మిక అంశాల కలబోతగా ఈ సినిమా ప్రేక్షకుల మనసుల్ని కదిలిస్తుందని మేకర్స్ చెబుతున్నారు. బేబీ నక్షత్ర, అజయ్‌ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, నిర్మాణం: మైత్రీ మూవీ మేకర్స్, కథ, స్ర్కీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: శివ నిర్వాణ.



## ఆంధ్రప్రదేశ్‌లో తొలి ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌కు ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి

**రూ.100 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక పైలట్ శిక్షణ కేంద్రం ఏర్పాటు**



రాజమహేంద్రవరం(ప్రశ్న న్యూస్) యువతకు ప్రపంచ స్థాయి విమానయాన శిక్షణ, ఉపాధి అవకాశాలు మధురపూడిలో జార్విస్ ఏవియేషన్ అకాడమీ ఆధ్వర్యంలో రూ.100 కోట్ల వ్యయంతో అత్యాధునిక ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీఓ) ఏర్పాటు చేస్తున్నట్లు రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తొలి ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌గా ఇది నిలవబోతుందని ఆమె పేర్కొన్నారు.గురువారం మధురపూడిలో జార్విస్ ఏవియేషన్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పైలట్ ట్రైనింగ్ సెంటర్‌కు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి మాట్లాడుతూ దేశ విమానయాన రంగ అభివృద్ధిలో ఇది ఒక కీలక ముందడుగు అని అన్నారు. సుమారు ఆరు నెలల్లో ఈ శిక్షణ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తొలి దశలో సుమారు 30 మంది శిక్షణార్థులకు శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండగా, గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం వాటి సంఖ్యను 166కు పెంచిందన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జార్విస్ ఏవియేషన్ అకాడమీ చైర్మన్ ఫణీంద్ర, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ డైరెక్టర్ కె. ప్రీత, విమానయాన శాఖ అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు, ప్రసన్నకుమార్, శశికాంత్ రామినేని, శిక్షణ నిపుణులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం

- ఆలయంలోని శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణ
- యాగశాల, గంట మండపం పునర్నిర్మాణానికి నిర్ణయం
- జులై 3న ఆలయ జీర్ణోద్ధరణ పనులకు శంకుస్థాపన
- ఆలయ అభివృద్ధిపై అధికారులతో మంత్రి నారా లోకేష్ సమీక్ష



ఉండవల్లి(ప్రశ్న న్యూస్) మంగళగిరి దిగువ సన్నిధిలోని ప్రసిద్ధ వైష్ణవ దివ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం జీర్ణోద్ధరణ, పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై ఉండవల్లి నివాసంలో అధికారులతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ ప్రతిపాదనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి లోకేష్ కు వివరించారు. ఆలయంలోని శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణతో పాటు యాగశాల, గంట మండపం పునర్ నిర్మాణం, వాహనశాల నూతన నిర్మాణానికి సమావేశంలో మంత్రి ఆమోదం తెలిపారు. ఆయా జీర్ణోద్ధరణ, అభివృద్ధి పనులను ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఆలయం వెలుపల చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపైనా మంత్రి లోకేష్ పలు సూచనలు చేశారు. ఆలయాన్ని అభివృద్ధి చేసే అవకాశం జీవితంలో ఒక్కసారి మాత్రమే వస్తుందని, భక్తులు సంతృప్తి చెందేలా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. రూ.6 కోట్ల వ్యయంతో మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో పలు జీర్ణోద్ధరణ, అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. జులై 3వ తేదీన ఆయా పనులకు శంకుస్థాపన చేయనున్నారు. దాతల నుంచి విరాళాలా సేకరణపైనా సమావేశంలో చర్చించారు.ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఆలయ ఈవో కోగంటి సునీల్ కుమార్, ఎండోమెంట్ చీఫ్ ఇంజనీర్ జి.శేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ మోహన్, వాస్తుశిల్పి పరమేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతికి, సంపూర్ణ ఆరోగ్యానికి దివ్యౌషధం యోగా: మంత్రి కందుల దుర్గేష్

**ప్రపంచానికి భారత్ ఇచ్చిన వరం యోగా, ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగం కావాలి**

**జూన్ 21న అమరావతిలో రాష్ట్ర స్థాయి యోగాంధ్ర వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం**



కడియం(ప్రశ్న న్యూస్) జీఎన్ఆర్ కన్వెన్షన్ హాల్ సమీపంలోని శివాంజనేయ నర్సరీ ప్రాంగణంలో గురువారం ఉదయం జిల్లా స్థాయి యోగా సాధన కార్యక్రమం ప్రోటోకాల్ ప్రకారం నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ , ఆయుష్, ఏపీ ఎం ఐ పి, హార్టికల్చర్ శాఖల ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ యోగా అనేది కేవలం భారతదేశానికే పరిమితం కాకుండా ప్రపంచ మానవాళి శాంతియుతంగా, ఆరోగ్యంగా జీవించేందుకు భారత్ అందించిన గొప్ప వరమని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని, క్రమం తప్పకుండా సాధన చేస్తే అది ఒక ఇష్టమైన అలవాటుగా మారుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి, ఆర్డీవో ఆర్. శివరాముడు, ఏపీఎంఐపీ పీడీ ఏ. దుర్గేష్, టూరిజం ఆర్డీ ఎన్.వి.వి.ఎస్. మూర్తి, డీఎంహెచ్‌వో డా. ఎన్. వసుంధర, యోగాంధ్ర సమన్వయకర్త విజయకుమారి, హార్టికల్చర్ అధికారి ఎన్. మల్లిఖార్జునరావు, జిల్లా పర్యాటక అధికారి పి. వెంకటాచలం, యోగా గురువు కె.వి.ఎన్. శ్రీధర్ రెడ్డి, శిక్షకులు కార్తిక్ రెడ్డి, హేమ నిర్మల, మాజీ ఎంపీపీ మార్గాని సత్యనారాయణ, మాధవరాయుడుపాలెం సర్పంచ్ ఏ. చంటి, శివాంజనేయ నర్సరీ ప్రతినిధులు మల్లు పోలరాజు, గట్టి నర్సయ్య, బ్రహ్మకుమారి మౌనిక, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, యోగా సాధకులు పాల్గొన్నారు.

## హనుమంత వాహనంపై శ్రీరామచంద్ర స్వరూపంలో గోకులానందుని దివ్య విహారం

**భక్తులపై కరుణాకటాక్షాలు కురిపించిన శ్రీ వేణుగోపాలస్వామి**



కార్వేటినగరం(ప్రశ్న న్యూస్) శ్రీ రుక్మిణి--సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం జరిగిన హనుమంత వాహనసేవ భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. స్వామివారు శ్రీరామచంద్రుని అలంకారంలో హనుమంత వాహనంపై విరాజిల్లుతూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు.బ్రహ్మోత్సవాల ఆరో రోజు సందర్భంగా హనుమంతునిపై ఆసీనులైన శ్రీ వేణుగోపాలస్వామివారు త్రేతాయుగంలో శ్రీమహావిష్ణువు శ్రీరాముడిగా అవతరించిన మహోన్నత ఘట్టాన్ని స్మరింపజేశారు. స్వామివారి దివ్య మంగళవిగ్రహాన్ని దర్శించిన భక్తులు ఆనందభాష్పాలతో పరవశించిపోయారు.వాహనసేవ మార్గమంతా భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. భక్తజన బృందాల కోలాటాలు, చెక్కభజనలు, గోవింద నామసంకీర్తనలు, మంగళవాయిద్యాలు ఉత్సవానికి విశేష శోభను చేకూర్చాయి.ఆగమ శాస్త్రాల ప్రకారం హనుమంత వాహనంపై శ్రీరామ స్వరూపంలో దర్శనమిచ్చే స్వామివారిని సేవించడం ద్వారా భోగమోక్షాలు, జ్ఞానవిజ్ఞానాలు, అభయం, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని విశ్వసిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గజవాహనంపై స్వామి వారు భక్తులను కటాక్షిస్తారు. 7వ రోజు శుక్రవారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామి వారు ఊరేగి భక్తులను ఆశీర్వదించనున్నారు.ఈ వాహనసేవలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చెంగల్రాయులు, ఆలయ అర్చకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు కర్మాగారం గురించి మాట్లాడే నైతిక హక్కు వైకాపాకు లేదు

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- మెగా డీఎస్సీని అడ్డుకోవడానికి 86 కేసులు వేసి విఫలమయ్యారు



కోటబొమ్మాళి(ప్రశ్న న్యూస్)తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక" రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో, ఒక సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో నియోజకవర్గం పరిధిలోని మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌ఛార్జులతో ఓటరు జాబితా సమగ్ర సవరణ 'సర్' ప్రక్రియపై జరిగిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాలుగు మండలాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, తెలుగుదేశం నాయకులు వెలయల కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, రెడ్డి అప్పన్న, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత ప్రయాణం పేరుతో మహిళలకు భద్రతలేని ప్రయాణమా

- కాలం చెల్లిన బస్సులు రోడ్లపైకి తెచ్చి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆర్టీసీ.
- తరచూ మార్గమధ్యంలో నిలిచిపోతున్న బస్సులు ఎవరి బాధ్యత.
- కానీ బస్సుల నిర్వహణకు నిధులు లేవా.?



విజయవాడ (ప్రశ్న న్యూస్) మహిళల సాధికారత పేరుతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రజాదరణ పొందుతున్నప్పటికీ, ఆ పథకం అమలులో నాణ్యత, భద్రత అంశాలు తీవ్ర విమర్శలకు గురవుతున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని గొప్పగా ప్రచారం చేస్తున్న అధికారులు, అదే సమయంలో కాలం చెల్లిన బస్సులను రోడ్లపై నడపడం పట్ల ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పాతబడిన బస్సులు తరచూ మార్గమధ్యంలో నిలిచిపోవడం, ఇంజిన్ సమస్యలు తలెత్తడం, బ్రేక్‌డౌన్‌లు జరగడం సాధారణమైపోయిందని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సుల్లో సీట్లు దెబ్బతినడం, కిటికీలు సరిగా లేకపోవడం, వర్షాకాలంలో పైకప్పుల నుంచి నీరు కారడం వంటి సమస్యలు ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.ముఖ్యంగా మహిళల కోసం ఉచిత ప్రయాణం అందిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, వారికి భద్రతతో కూడిన ప్రయాణాన్ని కల్పించడంలో విఫలమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రయాణం ఉచితంగా ఉన్నా, ప్రయాణించే వాహనం సురక్షితంగా లేకపోతే ఆ పథకం లక్ష్యం ఎలా నెరవేరుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.రవాణా రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రయాణికుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో కొత్త బస్సుల కొనుగోలు, పాత బస్సుల తొలగింపు, నిర్వహణ వ్యవస్థ బలోపేతం వంటి చర్యలు అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉంది. లేకపోతే ఉచిత ప్రయాణ పథకం ప్రయోజనం కంటే ప్రమాదాలే ఎక్కువయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.ప్రజల డబ్బుతో నడిచే ప్రజా రవాణా వ్యవస్థలో కేవలం పథకాల ప్రచారం కాకుండా, ప్రయాణికుల భద్రత, సౌకర్యం, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉచిత ప్రయాణం పేరుతో పాత బస్సుల్లో ప్రజలను ప్రయాణింపజేయడం అభివృద్ధి కాదు.. బాధ్యతారాహిత్యానికి నిదర్శనమనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

## ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వ చర్యలు: ఎమ్మెల్యే ఆరిమిల్లి



తణుకు (ప్రశ్న న్యూస్) ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఇంటింటికి తాగునీరు అందించే లక్ష్యంతో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించిన అమరజీవి జల ధార కార్యక్రమంలో భాగంగా రూ. 54 కోట్లు వ్యయంతో గురువారం పనులు ప్రారంభించారు. ఇరగవరం మండలం కావలిపురం శివారు యర్రాయిచెరువు గ్రామంలో పనులు ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడారు. తణుకు నియోజవర్గంలో దాదాపు 15 ప్రాంతాల్లో వాటర్ ట్యాంకులు నిర్మించడంతోపాటు పైపు లైను నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఇరగవరం మండలం కావలిపురం శివారు యర్రాయిచెరువు గ్రామంలో 20వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు రూ. 13 లక్షల వ్యయంతో నిర్మించడానికి పనులు ప్రారంభించామని తెలిపారు. నియోజకవర్గంలో 15 వాటర్ ట్యాంకులతో పాటు 154 కిలోమీటర్ల పైపులైను నిర్మించి ప్రతి ఇంటికి తాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో పెద్ద ఎత్తున అమరజీవి జలధార కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా రూ. 1400 కోట్లు వ్యయంతో ప్రాజెక్టును నిర్మించడం జరుగుతుందని అన్నారు. యర్రాయిచెరువు గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని వేసవిలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యలను అధిగమించే విధంగా రాబోయే సెప్టెంబర్ నాటికి ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని ప్రాజెక్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు చేసినట్లు తెలిపారు. రాబోయే వేసవికాలంలో తాగునీటి సమస్యను అధిగమించే చర్యలు చేపట్టామన్నారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేసి రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా నియోజకవర్గంలో బీటీ, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణంతోపాటు ప్రతి ఇంటికి తాగునీరు అందించి ప్రతి ఇంటికి కనీస సదుపాయాల కల్పించే లక్ష్యంతో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రెండేళ్ల కాలంలో దాదాపు రూ. 2 వేల కోట్లు అభివృద్ధి సంక్షేమాన్ని అమలు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసాన్ని పెంచేలా పోలీసు సేవలందించాలి

- పారదర్శక దర్యాప్తుతో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు:
- జిల్లా ఎస్పీ : మహేష్ బి. గితే



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ సబ్-డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతి, నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలు, పోలీసు సిబ్బంది పనితీరు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నమోదయ్యే ప్రతి కేసులో పారదర్శకంగా, నిష్పాక్షికంగా దర్యాప్తు నిర్వహించి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను గుర్తించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో అవసరమైతే న్యాయ సలహాలు తీసుకొని దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. అలాగే పెండింగ్ నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రతిరోజూ పర్యవేక్షణ నిర్వహించి, నిందితుల అరెస్టులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వవద్దని స్పష్టం చేశారు.పోలీసుల ప్రవర్తనే శాఖ ప్రతిష్ఠను నిర్ణయిస్తుందని పేర్కొన్న ఎస్పీ, విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి సీఐ, ఎస్ఐ తమ పరిధిలో స్థానిక ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పోలీసు శాఖపై విశ్వాసాన్ని పెంపొందించేలా పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, మధుకర్,ఎస్సైలు కిరణ్ కుమార్,రమాకాంత్,రమేష్, రామ్మోహన్, ప్రేమానందం, మోతిరాం,తదితరులు పాల్గొన్నారు.

## నేడు తుగ్గలి కు జిల్లా కలెక్టర్ సిరి రాక

**- పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరణ.**

**తుగ్గలి:** నేడు మండల కేంద్రమైన తుగ్గలి కు కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి వస్తున్నట్లు పత్తికొండ ఆర్డిఓ ఓబులేసు,తుగ్గలి తహసిల్దార్ రవి లు తెలియజేశారు.గురువారం రోజున తహసిల్దార్ కార్యాలయం నందు వారు మాట్లాడుతూ శుక్రవారం రోజున ఉదయం 9 గంటలకు తుగ్గలి లోని సాధనా విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి,పత్తికొండ శాసనసభ్యులు కే.ఈ శాంబాబు లు హాజరై తుగ్గలి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల ప్రజలకు సంబంధించిన ప్రజా సమస్యల దరఖాస్తులు స్వీకరిస్తారని వారు తెలియజేశారు.గురువారం రోజున జరిగే ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల పరిధిలోని గల అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని వారు తెలియజేశారు. కావున ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికను మండల వ్యాప్తంగా గల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు ప్రజలకు తెలియజేశారు.

# కథనాలు వరుసగా వస్తున్నా స్పందించని అధికారులు

## అక్రమ నిర్మాణాలపై చర్యలు ఎక్కడ.?

## అధికారుల మౌనం వెనుక మర్మమేంటి.?

## నాగారం డివిజన్‌లో అక్రమాల రాజ్యం





ఘట్కేసర్(ప్రశ్న న్యూస్)ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం మౌనవ్రతం పాటించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. పత్రికల్లో వరుస కథనాలు వెలువడుతున్నా, ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేస్తున్నా, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్తున్నా మున్సిపల్ అధికార యంత్రాంగం స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. చట్టాలను బేఖాతరు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టకపోవడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

### ఎన్ని ఫిర్యాదులు చేసిన ఫలితం శూన్యం

స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం అనుమతులకు మించి



అదనపు అంతస్తులు నిర్మించడం, పార్కింగ్ నిబంధనలను ఉల్లంఘించడం, సెట్‌బ్యాక్‌లు పాటించకపోవడం వంటి ఉల్లంఘనలు అనేక ప్రాంతాల్లో జరుగుతున్నాయి. వీటిపై సంబంధిత శాఖలకు ఫిర్యాదులు అందినా చర్యలు మాత్రం కనిపించడం లేదు. అక్రమాలు కళ్లముందే జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### అధికారుల మౌనం వెనుక రాజకీయ ఒత్తిళ్లా.?

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారన్న ప్రశ్న ఇప్పుడు ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొందరు నాయకుల ఒత్తిళ్ల కారణంగా అధికారులు వెనుకడుగు వేస్తున్నారా.? లేక అక్రమ నిర్మాణాలకు అండదండలు అందుతున్నాయా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చట్టాన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వ వ్యవస్థే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సాధారణ ప్రజలు ఎవరిని ఆశ్రయించాలనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

### అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి

అక్రమ నిర్మాణాల కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఫీజులు, జరిమానాలు, ఇతర ఆదాయాలు భారీగా కోల్పోతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. నిబంధనలను పాటించే భవన యజమానులకు ఒక న్యాయం, అక్రమాలకు పాల్పడేవారికి మరో న్యాయం అమలవుతున్నట్లు పరిస్థితులు కనిపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో మున్సిపల్ శాఖ వ్యవస్థపై విశ్వాసం క్రమంగా దెబ్బతింటోందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



### ఉన్నతాధికారులు జోక్యం తీసుకొని, చర్యలు తీసుకోరా.?

నాగారం డివిజన్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై మాత్రమే కాకుండా, ఫిర్యాదులు వచ్చినప్పటికీ చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

### అధికారులు అసలు పట్టించుకోరా.?

పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. ఫిర్యాదులు వెళ్తున్నాయి. ఆరోపణలు వినిపిస్తున్నాయి. కానీ చర్యలు మాత్రం కనిపించడం లేదు. నాగారం డివిజన్‌లో అక్రమ నిర్మాణాల వ్యవహారంపై అధికారుల మౌనం వెనుక అసలు కారణమేంటి.? ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. ఉన్నత అధికారులు ఇప్పటికైనా స్పందించి చట్ట పరమైన చర్యలు చేపడతారా.? లేక లంచాలు తీసుకుందామని మౌనాన్నే కొనసాగిస్తారా.? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# శ్రీవారి భక్తసేవకు వచ్చే వైద్య సేవలు పరిశీలించిన:జేఈవో డా. ఎ. శరత్

## సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



తిరుపతి (ప్రశ్న న్యూస్)శ్రీవారి భక్తులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రానున్న శ్రీవారి వైద్య సేవ నిపుణుల కోసం కేటాయించిన అతిథి గృహాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని టీటీడీ జేఈవో డా. ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం సంబంధిత అధికారులతో కలిసి వసతి కేంద్రాలను ఆయన పరిశీలించారు.

ఈ నెల 17వ తేదీన తొలి విడత వైద్య నిపుణులు రానున్న నేపథ్యంలో వశిష్ఠ అతిథి గృహం, ఆయుర్వేద కళాశాల అతిథి గృహం, స్విమ్స్ అతిథి గృహాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.వైద్యులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా భక్తులకు సేవలందించే విధంగా వసతి గృహాల్లో పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర మౌలిక వసతులను సమృద్ధిగా కల్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టీటీడీ ఎస్ఈలు మనోహరం, వేంకటేశ్వర్లు, ముఖ్య వైద్యాధికారి డాక్టర్ కుసుమ కుమారి, ఎస్వీ గోశాల డైరెక్టర్ డా. ఏవీఎన్ శివకుమార్, బర్డ్ సూపరింటెండెంట్ వెంకట రెడ్డి, టీటీడీ స్విమ్స్ అధికారులు పాల్గొన్నారు.

# నౌకలపై దాడులు ఆపండి

## - గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలపై భారత్ తీవ్ర ఆగ్రహం






న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) గల్ఫ్ ఆఫ్ ఒమన్, దాని పరిసర జలాల్లో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల కారణంగా భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోవడంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా జరిపిన ఓ దాడిలో ముగ్గురు భారతీయులు మరణించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇటువంటి దాడులను వెంటనే నిలిపివేయాలని, దౌత్య మార్గాల ద్వారా శాంతిని నెలకొల్పాలని భారత విదేశాంగ శాఖ పిలుపునిచ్చింది. బుధవారం ఒమన్ తీరంలో 'ఎంటీ సెటెబెల్లో' అనే ఆయిల్ ట్యాంకర్‌పై అమెరికా బలగాలు దాడి చేశాయి. అమెరికా ఆంక్షలను ఉల్లంఘించి, ఈ నౌక ఇరాన్ నుంచి చమురు రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడిలో డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజనీర్ పట్నాల సురేష్ అనే ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. నౌకలోని మరో 21 మంది భారత సిబ్బందిని సురక్షితంగా రక్షించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన భారత్, న్యూఢిల్లీలోని అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసి తన నిరసనను వ్యక్తం చేసింది. గడిచిన కొద్ది రోజుల్లో భారతీయులు ఉన్న మూడు నౌకలపై దాడులు జరిగినట్లు షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. జూన్ 8న 'మారివెక్స్' నౌకలో మంటలు చెలరేగగా, అందులోని 24 మంది భారత సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. గురువారం షినాస్ పోర్టు వద్ద 'ఎంటీ జల్వీర్' నౌకపై దాడి జరగ్గా, ఒమన్ అధికారులు స్పందించి 20 మంది భారత సిబ్బందిని రక్షించారు. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. నావికుల భద్రతకు, అంతర్జాతీయ జలాల్లో నౌకల స్వేచ్ఛాయుత ప్రయాణానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ నొక్కి చెప్పింది. ప్రస్తుతం హర్మూజ్ జలసంధిలో 13 భారతీయ నౌకలు, 562 మంది భారత నావికులు ఉన్నారని అధికారులు తెలిపారు. ప్రభావిత సిబ్బందికి అవసరమైన సహాయం అందించేందుకు ఒమన్ అధికారులతో భారత ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేసుకుంటోంది.

# ఫ్యూచర్ సిటికి తరలిపోనున్న తెలంగాణ సచివాలయం

## - సీఎం, డిప్యూటీ సీఎంలకు ఛాంబర్లు సిద్ధం!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు ఫ్యూచర్ సిటీలో నిర్మాణం, అభివృద్ధి ప్రణాళికలు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా దేశంలోనే అరుదైన గుర్తింపును సొంత చేసుకుంది ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారటీ బిల్డింగ్ (ఎఫ్సీడీఏ). పర్యావరణానికి ఏ మాత్రం హని కలిగించకుండా నిర్మించిన, అత్యాధునిక సదుపాయాలను ఏర్పాటు చేసినందుకు గ్రీన్ బిల్డింగ్ ట్యాంగ్‌ను దక్కించుకుంది. ఇప్పుడు ఈ సిటీకి సచివాలయాన్ని కూడా తరలించే ప్రక్రియ జరుగుతోందని ప్రచారం నడుస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రితోపాటు మంత్రుల ఛాంబర్స్ రెడీ అయ్యాయని అంటున్నారు.




### - భారత్ ఫ్యూచర్ సిటీలో ఏం జరుగుతోంది.?

హైదరాబాద్ మహానగరం తన పరిధి విస్తరించడంతోపాటు, జీహెచ్ఎంసీని విభజించడంతో పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ప్రయత్నంలో భాగంగా చేసిన ప్రయత్నాలు ఫలితాలు ఎలా ఉన్నా, ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపైనే కోటి ఆశలు పెట్టుకుంది రేవంత్ సర్కార్. ఏకంగా 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం వేగంగా జరుగుతోంది. భవిష్యత్‌లో 25 లక్షల నుంచి 30లక్షల జనాభా భారత్ ఫ్యూచర్ సిటీలో నివసించేలా మౌలిక సదుపాయాలు, అధునాతన వసతులు, విద్యా, ఉపాధి అవకాశాలు ఇలా ఒకటేమిటి తెలంగాణ అంటే ఫ్యూచర్ సిటీ, ఫ్యూచర్ సిటీ అంటే తెలంగాణ అనేంతలా కనీవినీ ఎరుగని రీతిలో వేగంగా అడుగులు ముందుకేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి.

### - దేశంలో నెంబర్ వన్‌గా నిలిచిన ఎఫ్సీడీఏ బిల్డింగ్ ప్రత్యేకతలివే..

ఫ్యూచర్ సిటి అభివృద్ధిలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం వేసిన తొలి అడుగే రికార్డ్ బద్దలు కొట్టింది. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, నిర్మాణ పనులు పర్యావేక్షణ, పెట్టుబడులు, అంతర్జాతీయ కంపెనీల పెట్టుబడులను ఎప్పటికప్పుడు పరిశీలించి, పర్యవేక్షించేందుకు ఫ్యూచర్ సిటిలో నిర్మించిన తొలి భారీ నిర్మాణం ఫ్యూచర్ సిటి డెవలప్‌మెంట్ అథారిటీ బిల్డింగ్. ఈ నిర్మాణంలో ఎక్కడా పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలు వినియోగించలేదు. పర్యావరణహిత నిర్మాణ ప్రమాణాలు పాటించినందుకు ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ చేత తాజాగా గ్రీన్ బిల్డింగ్ గుర్తింపు పొందింది దేశం దృష్టిని ఆకర్షించింది. వర్షపు నీటి సంరక్షణకు ఇక్కడ చేసిన ప్రత్యేక ఏర్పాట్లు, 15కిలోవాట్ల సౌరశక్తి సామర్థ్యంతో విత్ ప్లాంట్‌ను నిర్మాణం, ఫ్యూచర్ సిటీ విద్యుత్ అవసరాలకు కొంత భాగం సౌరశక్తిని వినియోగించేలా ప్రణాళికలు రూపొందించడం ఇలా ఒకటేమిటి ఫ్యూచర్ సిటీలో అన్నీ వినూత్న ప్రయోగాలే. ఫ్యూచర్ సిటీలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. విదేశీ ప్రతినిధులు, అధికారులు, పెట్టుబడిదారులు, బహుళజాతి సంస్థల ప్రతినిధులు ఎలక్ట్రికల్ వాహనాలు వినియోగించినా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఎఫ్సీడీఏ పరిసరాల్లో ఉత్పత్తి అయ్యే సేంద్రియ వ్యర్థాలను వినియోగించేందుకు బయోడైజర్టర్ ప్లాంట్ ఏర్పాటు ఇక్కడ మరో ప్రత్యేకతగా చెప్పవచ్చు. బయోగ్యాస్‌తో పాటు సేంద్రియ ఎరువులను తయారు చేయడంతో, ఫ్యూచర్ సిటీ నూతన భవనం వ్యర్థాల నిర్వహణలో పర్యావరణహిత భవనంగా నిలిచింది. అందుకే ఫ్యూచర్ సిటికీ కేరాఫ్‌గా నిలిచే ఎఫ్సీడీఏ బిల్డింగ్ కాలుష్యరహిత నిర్మాణంగా నెట్ జీరో బిల్డింగ్ గా పేరు తెచ్చుకుంది.

### - వారంలో ఓ రోజు ఫ్యూచర్ సిటీ సచివాలయంలోనే సీఎం, మంత్రులు..

ఫ్యూచర్ సిటి ప్రాజెక్టు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు. ఇక్కడ అభివృద్ధి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మాంచి బూస్ట్ ఇచ్చే అంశం. ఈ నేపథ్యంలో పెట్టుబడులు ఆకర్షించేందుకు, అభివృద్ధి భరోసా కల్పించేందుకు నేరుగా సీఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారు. వారంలో ఓ రోజు ఫ్యూచర్ సిటీ నుంచే పరిపాలన నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే సీఎం తోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సైతం ఎఫ్సీడీఏ అధునాతన భవనంలో ప్రత్యేక చాంబర్లు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

హైదరాబాద్‌కు సమీపంలో మరో అద్భుత నాల్గో నగరం భారత్ ఫ్యూచర్ సిటీ. ఇక్కడ యంగ్ ఇండియా యూనివర్సిటీ పనులు సైతం అత్యంతగా వేగంగా జరుగుతున్నాయి. ఏఐ టూ గ్రీన్ ఎనర్జీ వరకూ ఫ్యూచర్ సిటీలో ప్రతీ ప్రణాళికా ఓ అద్భుతమే. 3వేల ఎకరాల్లో ఫార్మా, బయో టెక్నాలజీలతోపాటు అంతర్జాతీయ విద్యాసంస్థలు, యూనివర్సిటీలు, స్కిల్ డెవల్మెంట్ , ఇలా అంతర్జాతీయంగా టాప్ 50 కంపెనీలతోపాటు , 1ట్రిలియన్ ఎకానమి టార్గెట్ గా ముందు అనుకున్నది అనుకున్నట్లుగా నిర్మాణాలు పూర్తై, పెట్టుబడులు వెల్లువెత్తితే ఫ్యూచర్ సిటీతోపాటు సీఎంగా రేవంత్ కు సైతం తిరుగులేదనే టాక్ పొలిటికల్ సర్కిల్ గట్టిగా వినిపిస్తోంది.

# దమ్ముంటే 12 వైఫల్యాలపై జవాబివ్వండి



**అమరావతి**(ప్రశ్న న్యూస్) కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజ్యసభ సీటు గురించి బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ, కేంద్ర ప్రభుత్వ 12 ఏళ్ల వైఫల్యాలపై సమాధానం చెప్పే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాజ్యసభ సీటు అనేది మాట ఇచ్చిన వారికి, తీసుకున్న వారికి సంబంధించిన వ్యక్తిగత విషయమని, మధ్యలో బీజేపీ నేతల అసహనం, అతి స్పందన ఎందుకని షర్మిల ప్రశ్నించారు. తాము ప్రజా సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తుంటే, సమాధానం చెప్పలేక అర్థం పర్థం లేని అంశాలను తెరపైకి తెచ్చి బీజేపీ తన సంస్కారాన్ని బయటపెట్టుకుంటోందని విమర్శించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే, కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన 12 వైఫల్యాలపై చర్చకు రావాలని, పుండు మీద కారం చల్లే చేష్టలు మానుకోవాలని హితవు పలికారు.కేంద్ర ప్రభుత్వ పాలనపై షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు. "రైళ్లు, రహదారులు అని గొప్పలు చెప్పడం కాదు, నిత్యావసరాల ధరలు 300 శాతం ఎందుకు పెరిగాయో చెప్పాలి. అతిపెద్ద స్టార్టప్ దేశమని చెప్పుకోవడం కాదు, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయారో సమాధానం చెప్పాలి. డీబీటీల గురించి కాదు, దేశవ్యాప్తంగా 28 సార్లు జరిగిన పేపర్ లీకుల గురించి మాట్లాడాలి. మహిళా సాధికారిత అని సమర్థించుకోవడం కాదు, ఏటా జరుగుతున్న 5 లక్షల అఘాయిత్యాలపై జవాబివ్వాలి" అని ఆమె నిలదీశారు. అంతేకాకుండా, దేశ ఆర్థిక పరిస్థితిపైనా షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. "తెచ్చిన లక్షల కోట్ల అప్పులు ఎక్కడ ఖర్చు చేశారో శ్వేతపత్రం ఇవ్వాలి. దేశీయ ఆర్థిక వృద్ధి మెరుగ్గా ఉంటే, డాలర్‌తో రూపాయి విలువ రెండింతలు ఎందుకు పతనమైంది? పీఎం కిసాన్ నిధులతో రైతులను ఆదుకుంటే, ఏటా 12 వేల మంది రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు?" అని ఆమె ప్రశ్నించారు.విభజన రాజకీయాల గురించి బీజేపీ మాట్లాడటం 'దెయ్యాలు వేదాలు వల్లించినట్టు' ఉందని షర్మిల ఎద్దేవా చేశారు. మతాల మధ్య చిచ్చు పెట్టి, ఓటు బ్యాంకు రాజకీయాలు చేసేది ఎవరో దేశ ప్రజలందరికీ తెలుసన్నారు. ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగ సంస్థలను కీలుబొమ్మలుగా మార్చుకుని, ఓట్లు, సీట్ల చోరీకి పాల్పడుతున్నంత కాలం బీజేపీకి ప్రజాభిమానం లభించదని, వారికి దక్కేవి దొంగ సర్టిఫికెట్లు మాత్రమేనని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ అంకితభావంతో ఉందని, ప్రజా ఉద్యమ గొంతుక తమదేనని షర్మిల స్పష్టం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588